RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | మంగళవారం, ఏప్రిల్ 14, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 12 | పేజీలు: 8 | వెల : రూ.1



**ఓట్ల తొలగింపుతో ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేం: సుప్రీంకోర్టు**



# లోక్‌సభ సీట్ల పెంపుపై రేవంత్ ఆగ్రహం

- జనాభా పేరుతో సీట్ల పెంపు ప్రయత్నాలపై తీవ్ర విమర్శలు
- మహిళా రిజర్వేషన్ల పేరుతో రాజకీయ లాభం చూస్తోందని ఆరోపణ
- దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళన
- అఖిలపక్ష చర్చల తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచన
- బీజేపీలో మహిళలకు స్థానం లేదని ఘాటు వ్యాఖ్యలు
- నియోజకవర్గాల పునర్విభజనపై పోరాటానికి సిద్ధమని హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 13: జనాభా ఆధారంగా లోక్‌సభ స్థానాలను పెంచే ప్రయత్నాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని, అఖిలపక్ష సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు దేశవ్యాప్తంగా మద్దతు ఉన్నప్పటికీ, అదే పేరుతో లోక్‌సభ సీట్ల పెంపును అనుసంధానించడం సరికాదని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ సీట్ల పెంపు రెండూ వేర్వేరు అంశాలని ప్రతి ఒక్కరికి తెలుసని ఆయన అన్నారు. అసెంబ్లీ స్థాయిలో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే దేశం మొత్తం అంగీకరిస్తుందని, కానీ జనాభా ఆధారంగా లోక్‌సభ స్థానాల పెంపు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ విధానం భవిష్యత్తులో దేశ సమతుల్యతను దెబ్బతీసే

(మిగతా 2వ పేజీలో)



**తెలంగాణలో ఈ నెల 22 నుంచి ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె**



**హార్మూజ్ గుండా వెళ్లే భారత నౌకలకు టోల్ ఫీజు లేదు: ఇరాన్ రాయబారి**



**తక్షణమే రూ.144 కోట్లు డిపాజిట్ చేస్తే కుప్పకూలిపోతాం: ఢిల్లీ హైకోర్టులో స్పైస్ జెట్**



## ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు కేవలం స్థానిక నాయకుల మధ్య అవగాహనే

### : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

తెలంగాణలో పొత్తుల అంశంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కీలక ప్రకటన చేశారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించిన నేపథ్యంలో నిర్మల్‌లో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని, ఒంటరిగానే పోరాడుతుందని స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు కేవలం స్థానిక నాయకుల మధ్య కుదిరిన అవగాహన మాత్రమేనని, పార్టీ పరంగా ఎలాంటి అధికారిక పొత్తు లేదని ఆయన వివరణ ఇచ్చారు. అధికార కాంగ్రెస్ పార్టీ పోలీసు బలంతో, గుండాయిజంతో భయభ్రాంతులకు గురిచేసినప్పటికీ, ప్రజలు బీజేపీకే పట్టం కట్టారని

(మిగతా 2వ పేజీలో)

## సరికొత్త చరిత్ర దిశగా భారత్: ప్రధాని మోదీ

- మహిళా రిజర్వేషన్ చట్టంపై కీలక ప్రకటన
- దేశ ప్రజాస్వామ్యానికి మహిళలతో మరింత బలం
- దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లుకు ముందడుగు
- ప్రతి రాజకీయ పార్టీ మద్దతు అవసరమని పిలుపు
- మహిళల నాయకత్వంతో అభివృద్ధి పెరుగుతుందని విశ్వాసం
- త్వరలో అమలు దిశగా చర్యలు చేపడతామని స్పష్టం



న్యూఢిల్లీ: చట్టసభల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు త్వరలో చట్టరూపం దాల్చనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా భారతదేశం సరికొత్త చరిత్రను సృష్టించబోతోందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించిన నారీ శక్తి వందన్ సమ్మేళన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ఇది ఈ శతాబ్దంలోనే అత్యంత కీలకమైన నిర్ణయాల్లో ఒకటిగా నిలుస్తుందని చెప్పారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థను మహిళలు మరింత బలోపేతం చేస్తారని ప్రధాని అన్నారు. మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం కాలానుగుణ అవసరమని పేర్కొన్నారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ బిల్లును ముందుకు తీసుకువచ్చే సమయం ఆసన్నమైందని తెలిపారు. దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర మరింత కీలకమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళల నాయకత్వంలో అభివృద్ధి వేగం పెరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలోని

(మిగతా 2వ పేజీలో)



## ఇది చొరబాటుదారులను తరిమికొట్టే సమయం

- బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా
- నక్సలిజాన్ని పూర్తిగా అణిచివేశామని ప్రకటన
- చొరబాట్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- మమతా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని హామీ
- రాబోయే ఎన్నికల్లో భారీ విజయంపై ధీమా

రాణిగంజ్ : దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అణిచివేసిన తరువాత ఇప్పుడు చొరబాటుదారులను తరిమికొట్టే సమయం వచ్చిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్ ప్రాంతంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు హింస, బెదిరింపులకు బదులుగా ఓట్లతో సమాధానం చెబుతారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుత ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్నారని, మార్పు కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. రాబోయే ప్రభుత్వం తమ పార్టీదేనని ధీమా

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

మంగళవారం, ఏప్రిల్ 14, 2026

# తక్షణమే రూ.144 కోట్లు డిపాజిట్ చేస్తే కుప్పకూలిపోతాం: ఢిల్లీ హైకోర్టులో స్పైస్‌జెట్

న్యూఢిల్లీ: కళానిధి మారన్, ఆయనకు చెందిన కేఏఎల్ ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో తమకు చాలాకాలంగా నడుస్తున్న వివాదంలో, రూ.144.5 కోట్లను తక్షణమే డిపాజిట్ చేయాలని ఒత్తిడి తెస్తే తాము కుప్పకూలుతామని ప్రముఖ విమానయాన సంస్థ స్పైస్ జెట్ ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఈ నగదు డిపాజిట్‌కు సంబంధించి సంస్థ చెల్లింపు గడువు ఏప్రిల్ 14వ తేదీతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో స్పైస్ జెట్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా విమాన సర్వీసులకు ఆటంకం కలగడం, విమాన ఇంధన ధరలు పెరగడం వల్ల నగదు కొరత ఏర్పడిందని స్పైస్ జెట్ కోర్టుకు తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ భారీ మొత్తాన్ని నగదు రూపంలో చెల్లించాల్సి వస్తే ఆర్థికంగా దెబ్బతిని తమ వ్యవస్థ కుప్పకూలిపోయే ప్రమాదం ఉందని వాపోయింది. నగదుకు బదులు గురుగ్రామ్‌లో తమ కంపెనీకి ఉన్న ఎకరం వాణిజ్య భూమిని సెక్యూరిటీగా పెట్టుకోవాలని కోరింది. ఈ భూమిని అత్యవసరంగా విక్రయిస్తే 50 శాతం తక్కువ ధరకు అమ్మవలసి వస్తుందని, నష్టానికి ఆస్తులను అమ్ముకునేలా బలవంతం చేయవద్దని కోరింది. వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది. స్పైస్ జెట్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. 2015లో స్పైస్ జెట్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో కళానిధి మారన్ తన 58.46 శాతం షేర్లను స్పైస్ జెట్ వ్యవస్థాపకుడు అజయ్ సింగ్ పేరుపై మార్చారు. తాను పెట్టుబడి పెట్టిన రూ.679 కోట్లకు బదులు కన్వర్టబుల్ వారెంట్స్, ప్రిఫరెన్స్ షేర్లను ఇచ్చేలా ఇరువురి మధ్య ఒప్పందం కుదిరింది. తనకు షేర్లు ఇవ్వకపోవడంతో కళానిధి మారన్




మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. వడ్డీతో సహా కళానిధి మారన్‌కు చెల్లించాలని 2018లో ఈ ట్రైబ్యునల్ ఆదేశించింది. ఈ వివాదానికి సంబంధించి రూ.144.51 కోట్లను కోర్టులో డిపాజిట్ చేయాలని ఢిల్లీ హైకోర్టు గతంలో స్పైస్ జెట్‌ను ఆదేశించింది. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లినప్పటికీ స్పైస్ జెట్‌కు ఊరట దక్కలేదు. దీంతో ఢిల్లీ హైకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది.

# హర్మూజ్ గుండా వెళ్లే భారత నౌకలకు టోల్ ఫీజు లేదు: ఇరాన్ రాయబారి



హర్మూజ్ జలసంధి గుండా వెళుతున్న భారతీయ చమురు ట్యాంకర్ల నుంచి తాము ఎలాంటి టోల్ ఫీజును వసూలు చేయడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీ న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్, భారత్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుత క్లిష్ట సమయంలోనూ సానుకూల సంబంధాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. భారత్‌తో ఉన్న మైత్రి కారణంగా రవాణా ఉచితంగా సాగుతోందని అన్నారు. అమెరికాతో చర్చలు పునఃప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కానీ తమ డిమాండ్లకు అనుకూలంగా స్పందించాలని స్పష్టం చేశారు. మా షరతులను అమెరికా అంగీకరిస్తే, మరో విడత చర్చలు సాధ్యమవుతాయని అన్నారు. ఇటీవల తాత్కాలిక యుద్ధ విరమణ అనంతరం చర్చల సందర్భంగా అమెరికా అంగీకార యోగ్యం కాని డిమాండ్లు తమ ముందు ఉంచిందని పేర్కొన్నారు. అందుకే చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడిందని అన్నారు. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై మహమ్మద్ ఫతాలీ స్పందిస్తూ, ఇరాన్ సామర్థ్యం గురించి వాషింగ్టన్‌కు తెలుసని అన్నారు. పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో, భారత్, ఇరాన్ ద్వైపాక్షిక సంబంధాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు.



## తెలంగాణలో ఈ నెల 22 నుంచి ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె

హైదరాబాద్, ఏప్రిల్ 13: : తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్ మోగింది. ఈ నెల 22వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నట్లు తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. గత నెల 13వ తేదీన యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చినట్లు తెలిపింది. కానీ యాజమాన్యం నుంచి ఎలాంటి హామీ రాలేదని వెల్లడించింది. ప్రభుత్వం, యాజమాన్యం ముందు తాము 32 డిమాండ్లను ఉంచామని పేర్కొంది. ఈ మేరకు ఆర్టీసీ జేఏసీ వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే సమ్మె నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె నుంచి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని పలు డిమాండ్లు యాజమాన్యం ముందు ఉంచినట్లు తెలిపారు.

## ఆశా భోంస్లే ఆశయాలకు ప్రతిరూపంగా మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్.. మహారాష్ట్ర సీఎం ప్రకటన



దిగ్గజ గాయని, స్వర్గీయ ఆశా భోంస్లే ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో ఒక మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ ను ఏర్పాటు చేయనున్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సోమవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆశాజీకి ఘన నివాళు లర్పించిన అనంతరం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి సునేత్రా అజిత్ పవార్‌తో పాటు ఇతర కేబినెట్ సభ్యులు పాల్గొన్నారు. సంగీత రంగంలో ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను గతంలో ఆశా భోంస్లే స్వయంగా ప్రభుత్వానికి అందించారని ఫడ్నవిస్ గుర్తుచేశారు. "ఆ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆశా తాయ్ కలలుగన్న ఆ సంస్థను సాకారం చేసేందుకు అవసరమైన అన్ని సానుకూల చర్యలు తీసుకుంటాం" అని ఆయన స్పష్టం చేశారు. సమావేశం ప్రారంభంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్, ఆశా భోంస్లే మృతికి సంతాప తీర్మానాన్ని చదివి వినిపించారు. అనంతరం కేబినెట్ సభ్యులందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆశా భోంస్లేకు నివాళులర్పిస్తూ ఫడ్నవిస్ భావోద్వేగంగా మాట్లాడారు. "ఈరోజు సుమధుర స్వరాల ఉద్యానవనం నిర్మానుష్యంగా మారింది. ఆశా తాయ్ స్వరం సంగీతానికి ఆత్మ లాంటిది" అని అన్నారు. "'తోరా మన్ దర్పణ్ కెహలాయే' వంటి ఆర్ద్ర గీతాల నుంచి 'ఖల్లాస్' వంటి హుషారైన పాటల వరకు ఆమె ప్రతి భావాన్నీ సులభంగా పలికించారు. భక్తి గీతాలు, గజల్స్, క్లాసికల్, పాప్ అనే తేడా లేకుండా అన్నింటిలోనూ తనదైన ముద్ర వేశారు," అని కొనియాడారు. మరాఠీ, హిందీ సహా 20 భారతీయ, విదేశీ భాషల్లో 12,000కు పైగా పాటలు పాడిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఆమె అని ప్రశంసించారు. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమాన్ని గుర్తుచేసుకుంటూ, "ప్రపంచ రేడియో దినోత్సవం రోజు మేమిద్దరం కలిశాం. అప్పుడు నాతో 'అభీ నా జావో ఛోడ్ కర్...' పాటను బలవంతంగా పాడించి, 'చూశారా, ముఖ్యమంత్రితో పాట పాడించాను' అని సరదాగా అన్నారు. అలాంటి వ్యక్తి ఇక మన మధ్య లేరనే వాస్తవాన్ని జీర్ణించుకోవడం కష్టంగా ఉంది" అని ఫడ్నవిస్ అన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు, దేశవ్యాప్తంగా ఉన్న అసంఖ్యాక అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## హైదరాబాద్ నగరంలో రికార్డుస్థాయికి విద్యుత్ వినియోగం



హైదరాబాద్ నగరంలో విద్యుత్ వినియోగం ఏప్రిల్ 13న రికార్డు స్థాయికి చేరుకుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైనట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. నేడు సాయంత్రం 16.01 గంటలకు జీహెచ్‌ఎంసీ పరిధిలో 4,381 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ వినియోగం నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ, ఇప్పటి వరకు ఇది అత్యధికం. గ్రేటర్ హైదరాబాద్ చరిత్రలో 2026 మార్చి 3వ తేదీన 4,421 మెగావాట్ల విద్యుత్ వినియోగంతో ఇప్పటి వరకు ఆల్ టైమ్ రికార్డుగా ఉంది. రోజురోజుకు డిమాండ్ పెరుగుతున్నప్పటికీ గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతూ వినియోగదారులకు అవాంతరాలు ఎదురుకాకుండా విద్యుత్ సరఫరా సాగిస్తున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ తెలిపింది. భవిష్యత్తులో మరింత డిమాండ్ పెరిగినా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది.

## రేవంత్ రెడ్డి ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధం: బండి సంజయ్



నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఖండించారు. ఆదాయం ప్రాతిపదికన సీట్ల విభజన జరగాలన్న రేవంత్ రెడ్డి వాదనను రాజ్యాంగ విరుద్ధమని కొట్టిపారేశారు. "అత్యధిక ఆదాయం ఇచ్చే ప్రాంతాలకే ఎక్కువ సీట్లు ఇవ్వాలన్నది రేవంత్ రెడ్డి వాదన. అదే నిజమైతే హైదరాబాద్‌కే అన్ని సీట్లూ ఇవ్వాలా? వెనుకబడిన పాలమూరు, ఆదిలాబాద్ వంటి జిల్లాల పరిస్థితి ఏమిటి?" అని సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు నిధులు పంపి, ఇప్పుడు డబ్బు చుట్టూనే సిద్ధాంతాలు అల్లుతున్నారా? అని ఎద్దేవా చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పునాదులను కాంగ్రెస్ బలహీనపరుస్తోందని విమర్శించారు. అంబేద్కర్ జయంతికి ముందే ఆయన ఆశయాలను కించపరిచేలా ముఖ్యమంత్రి మాట్లాడటం బాధాకరమని, అంబేద్కర్ బతికుంటే కాంగ్రెస్‌ను దేశం నుంచి బహిష్కరించేవారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని విమర్శించారు. గత 50 ఏళ్లలో 33 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించిన ఆయన, గతంలో పార్లమెంట్‌లో బిల్లు కాపీలు చించివేసిన ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలతో కాంగ్రెస్ పొత్తులు పెట్టుకోవడంపై నిలదీశారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచాలని ప్రధాని మోదీ నిర్ణయించారని, ఇది అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయడమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ విభజన రాజకీయాలకు నిదర్శనమని, ఇప్పటికైనా రాజ్యాంగ విలువలపై గౌరవంతో మాట్లాడాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## లోక్‌సభ సీట్ల పెంపుపై రేవంత్ ఆగ్రహం



ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దామాషా విధానం కాకుండా మరో సముచిత పద్ధతిని అనుసరించాలని ఆయన కోరారు. అన్ని రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఏర్పడిన తర్వాతే ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. దేశ ప్రయోజనాలే ప్రతి పార్టీకి ముఖ్యమని ఆయన అన్నారు. ఇక మహిళల విషయంలో బీజేపీ వైఖరిపై కూడా రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ ఏర్పడి దశాబ్దాలైనా ఇప్పటివరకు ఒక మహిళను కూడా పార్టీ అధ్యక్షురాలిగా నియమించలేదని విమర్శించారు. దీనివల్ల మహిళల పట్ల ఆ పార్టీకి ఉన్న గౌరవం ఎంత అనేది స్పష్టమవుతుందని అన్నారు. మహిళలకు ప్రాధాన్యం ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని, ఇందిరాగాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో దేశం ముందుకు సాగిందని గుర్తుచేశారు. మహిళలకు న్యాయం గురించి మాట్లాడే ముందు బీజేపీ తన పార్టీలో మహిళలకు తగిన స్థానం ఇవ్వాలని సూచించారు. నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలను ఏకం చేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. అవసరమైతే ఈ అంశంపై పోరాటం కూడా చేస్తామని హెచ్చరించారు. పార్లమెంటులో ఈ బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తామని సవాల్ విసిరారు. దేశ సమతుల్యతను కాపాడే బాధ్యత తమపై ఉందని, కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ముందుండి పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఓట్ల తొలగింపుతో ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అధిక సంఖ్యలో ఓట్లను తొలగించినా, ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయపరమైన జోక్యం అనేది ఎన్నికలను ప్రోత్సహించేలా ఉండాలని తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన 'సర్' ప్రక్రియపై భారత అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటరు జాబితాలో కొనసాగే హక్కు ఓటరుకు ఉంటుందని, ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడితో ప్రక్రియను వక్రీకరించకూడదని పేర్కొంది. అయితే, 'సర్' ప్రక్రియలో ఓట్లు తొలగించారంటూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ పిటిషన్లు ఇప్పటికే అప్పిలేట్ ట్రైబ్యునళ్ల ముందు విచారణకు ఉన్నాయని గుర్తు చేసింది. సరైన ప్రక్రియ లేకుండా ఎన్నికల సంఘం ఏకపక్షంగా ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తోందని, ఈ తొలగింపులపై దాఖలైన పిటిషన్లను సకాలంలో విచారించడం లేదని పిటిషనర్లు ఆరోపించగా, పిటిషనర్లు ఇప్పటికై ట్రైబ్యునళ్లను ఆశ్రయించారని, కాబట్టి ఈ వాదనల్లో పసలేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'సర్' ప్రక్రియపై దాఖలైన పిటిషన్లను విచారించేందుకు కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు 19 ట్రైబ్యునళ్లు ఏర్పడినట్లు ఈసీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారించాల్సిన అప్పీళ్ల సంఖ్య 30 నుంచి 34 లక్షల వరకు ఉంటాయని తెలిపింది.అయితే ఈ అప్పీళ్లను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తారా లేక గడువును పొడిగిస్తూనే ఉంటారా అని పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశ్నించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ దేశంలో ఓటు రాజ్యాంగపరమైనదే కాకుండా, భావోద్వేగ అంశం కూడా అని పేర్కొంది. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో భాగమని తెలిపింది. ఒక ప్రభుత్వాన్ని ఎంచుకోవడంలో ఇది కీలకమని వ్యాఖ్యానించింది. అలాగే విచారణకు సంబంధించి కాలపరిమితిని నిర్ణయించి ట్రైబ్యునళ్లపై భారం మోపలేమని స్పష్టం చేసింది. అధిక సంఖ్యలో ఓటర్లను తొలగించినా, ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేమని తెలిపింది.

## ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు కేవలం స్థానిక నాయకుల మధ్య అవగాహనే

ఆయన కొనియాడారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ అధికార బలం పనిచేయలేదని ఎద్దేవా చేశారు. తలసరి ఆదాయం ప్రాతిపదికన అసెంబ్లీ సీట్లు పెంచాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఈ ప్రతిపాదన పేదలను, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని అణచివేయడమేనని విమర్శించారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో మహిళల హక్కులను పట్టించుకోలేదని మండిపడ్డారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా బీజేపీ అడుగులు వేస్తోందని, వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్ కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతోందని, రానున్న రోజుల్లో సొంత బలంతోనే అధికారం చేపడతామని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశ రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం లభిస్తుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## సరికొత్త చరిత్ర దిశగా భారత్: ప్రధాని మోదీ

అన్ని వర్గాల పురోగతికి మహిళల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ఈ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, దేశ ప్రయోజనాలకు సంబంధించినదని స్పష్టం చేశారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు దిశగా త్వరలోనే కార్యాచరణ ప్రారంభమవుతుందని తెలిపారు. నిర్ణీత కాలంలో ఈ బిల్లును అమలు చేసి మహిళలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

## ఇది చొరబాటుదారులను తరిమికొట్టే సమయం

వ్యక్తం చేశారు. పోలింగ్ రోజున ఎవరైనా అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చట్టాన్ని ఉల్లంఘించిన వారిని జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు.దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అక్రమంగా నివసిస్తున్న చొరబాటుదారులను గుర్తించి వెనక్కి పంపిస్తామని తెలిపారు. గతంలో కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు ఉగ్రవాదం, చొరబాట్ల విషయంలో నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. ప్రస్తుతం మాత్రం దేశ భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని అన్నారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి తమ ప్రభుత్వం గట్టి ప్రతీకారం తీర్చుకుందని పేర్కొన్నారు. దేశాన్ని భయపెట్టే శక్తులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఉగ్రవాదానికి ఆశ్రయం ఇచ్చే శక్తులపై కఠిన చర్యలు కొనసాగుతాయని అన్నారు. మహిళల భద్రత విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. రాత్రివేళల్లో కూడా మహిళలు భయపడకుండా తిరిగే వాతావరణాన్ని సృష్టించడం తమ లక్ష్యమని చెప్పారు. గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాబోయే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించనున్నాయని పేర్కొన్న ఆయన, ప్రజలు మార్పు కోసం ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, భద్రత, శాంతి కోసం తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక





## అక్రమ భావన నిర్మాణాలపై హెచ్చార్సీలో పిర్యాదు దళిత చైతన్య సంఘం

నాంపల్లి : ఏప్రిల్ 13 ( వాయిస్ టుడే): అక్రమ నిర్మాణాలు చేపడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సికింద్రాబాద్ బిజెపి నాయకుడు శ్యామ్ సుందర్ పై చర్యలు తీసుకోవాలని దళిత చైతన్య సంఘం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ లో ఫిర్యాదు చేసింది. జమై ఉస్మానియా రైల్వే ట్రక్ కు ఆనుకోని అక్రమ నిర్మాణం చేపట్టారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో జిహెచ్ఎంసీ కమిషనర్ కు ఫిర్యాదు చేశామని , కానీ న్యాస్థానాన్ని తప్పుదోవ పట్టించి స్టే తెచ్చుకున్నారని తెలిపారు. సామాజిక దృక్పథంతో తాను ఫిర్యాదు చేస్తే , తనను చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. తనకు ప్రాణ రక్షణ కల్పించి , అక్రమ నిర్మాణంను కూల్చివేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కమిషన్ ను కోరారు.



## చీర్యాల లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో సుదర్శన హోమం

నాగారం, ఏప్రిల్ 13:-(వాయిస్ టుడే)కీసర మండలం చీర్యాల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం స్వామి వారికి అభిషేకం, సుదర్శన నారసింహ యోగ హోమం, రక్షాబంధన వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేసవి ఎండల దృష్ట్యా ఆలయ చైర్మన్ మల్లరపు లక్ష్మీనారాయణ భక్తుల కోసం చలువ పందిళ్ళు ఆలయం చుట్టూ వేయించారు. ఈ సందర్భంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## చీర్యాలలో ఉచిత మెగా వైద్య శిబిరం

నాగారం, ఏప్రిల్ 13:-(వాయిస్ టుడే)కీసర మండలంలోని చీర్యాలలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిసిసి కార్యదర్శి బక్కని నర్సింగ్ రావు ప్రారంభించారు. శిబిరంలో మొత్తం96 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలలో కంటి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు, ఇంకా చింతకింద అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ఆక్రమణలను తొలగించండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 13(వాయిస్ టుడే): చింతల్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా సిపిఐ నాయకులు డిప్యూటీ కమిషనర్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట 280 డివిజన్లో జగద్గిరిగుట్ట మెయిన్ రోడ్డు మరియు అవుట్ పోస్టునుండి హెచ్ఎంటి వెళ్లేదారిలో రోడ్డు విస్తరణ సందర్భంగా మిగిలిన భూమిలో షెడ్లు వెయ్యడం వల్ల వాహనాలను రోడ్డుపైన పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ ఏర్పడి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతుందని గతంలో కొన్నిచోట్ల కూల్చివేతలు జరిగినప్పటికీ తిరిగి మళ్లీ వేసుకుంటున్నారని కావున వెంటనే తొలగించి ఫుట్పాత్ ను వేయాల్సిందిగా కోరడం జరిగింది. అదేవిధంగా బీరప్ప నగర్ నుండి మగ్దుమ్ నగర్కు వేసిన రోడ్డు వల్ల సుమారు 10 ఫీట్ల వరకు స్థలం మిగిలిపోయిందని ఆ మిగిలిన స్థలం అక్కడి వారికే కేటాయిస్తామని చెప్పి కొంతమంది డబ్బులు వసూలు చేసినట్టు సమాచారం ఉందని అలాంటిది జరగకుండా గతంలో సిపిఐ పార్టీగా వినతి పత్రం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు లేదని ఇప్పటికైనా ఆ మిగిలిన స్థలంలో చెట్లను నాటి ప్రతి శుక్రవారం జరిగే మార్కెట్ను ఇక్కడ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహారెడ్డి ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు సిపిఐ నాయకులు కృష్ణ, ఇమామ్, సామెల్, రవి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసిన నూతనంగా ఎన్నికైన వాణి నగర్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 13(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ వారి నివాసం (షాపూర్ నగర్ లో) గణేష్ నగర్ డివిజన్ పరిధిలోని వాణి నగర్ నూతన అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సుకుమార్ మర్యాదపూర్వకంగా కలిసిన శాలువాతో సత్కరించారు..ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ నూతన అధ్యక్షుడు సుకుమార్ ను, అభినందించి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు ఇలాంటి సమస్య తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో వాణి నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుకుమార్ మరియు రవీందర్ గౌడ్, సత్యనారాయణ, సూర్యనారాయణ, వెంకట్ రాజ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## బాచుపల్లిలో ఘనంగా శ్రీ రాజరాజేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

### ముఖ్య అతిథిగా కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 13(వాయిస్ టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి పరిధి నందనవనం కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వర (మరకత లింగం) సహిత పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలయ నిర్మాణకర్త చెనమేని మహేష్ ఆహ్వానం మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 13(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంర్ఫ్ ) ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంర్ఫ్ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు.

కొంపల్లి వాసులు తిరునగిరి రవిన్ రూ. 60,000/-

జగద్గిరిగుట్ట వాసులు నిమ్మన్నాగొంటి ధనమ్మ రూ. 60,000/-

ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ......... ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు,. కార్యకర్తలు పాల్గొన్నారు.



## అమెరికా వర్జీనియాలో డ్యాన్స్ ప్రోగ్రాం

నాగారం, ఏప్రిల్ 13:-(వాయిస్ టుడే)అమెరికాలోని వర్జీనియాలో గాట్ టాలెంట్ ప్రోగ్రాం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. తెలుగు వారు నివసించే వర్జీనియాలో జిఆర్టిఎ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్యాన్స్ కార్యక్రమంలో 800 మంది చిన్నారుల కళాకారులు పాల్గొని తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కాగా ఈ పోటీలలో తెలుగు, తమిళ, కన్నడ ఇంకా నార్త ఇండియన్ కు చెందిన చిన్నారి కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిఆర్టిఎ మాజీ అధ్యక్షుడు మొరిశెట్టి శ్రవణ్, టెక్నాలజీ అండ్ ఫైనాన్స్ లీడర్ గౌతమ్ గాంధీ, హసిత, పలువురు తెలుగు, ఇతర రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్‌కు ఘన సన్మానం

నాచారం (వాయిస్ టుడే): మాణికేశ్వర్నగర్కు చెందిన కాంగ్రెస్ నాయకులు, వడ్డె ఓబన్న ఉత్సవ కమిటీ మెంబర్ గండికోట కుమార్ ఇటీవల సికింద్రాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైనారు. ఈ సందర్భంగా ఆదివారం మాణికేశ్వర్ నగర్లో శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ ఆధ్వర్యంలో కుమార్ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ గండికోట వడ్డె సొసైటీ కార్యవర్గం పాల్గొన్నారు.



## మీడియా సమావేశం ఏర్పాటు

### రావుల శ్రీధర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ -- బీఆర్ఎస్

జూబ్లీహిల్స్ 13 ఏప్రిల్ (వాయిస్ టుడే): రహమత్‌నగర్ డివిజన్‌లోని ఎస్పీఆర్ హిల్స్‌లో ఉన్న 6 ఎకరాల ప్రభుత్వ భూమిని జిహెచ్ఎంసి లేదా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీకి అప్పగించి పూర్తి స్థాయి క్రీడా మైదానంగా అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో క్వారీగా ఉన్న ఈ ప్రాంతాన్ని కేవీఆర్ ప్రభుత్వ హయాంలో మట్టితో నింపి క్రీడలు, సామాజిక కార్యక్రమాల కోసం మైదానంగా అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. ఆ స్థలాన్ని వర్కింగ్ విమెన్ హాస్టల్, విద్యాశాఖకు కేటాయించడం సరైంది కాదని అన్నారు. ఈ నిర్ణయాన్ని విరమించి మైదానాన్ని క్రీడా అవసరాల కోసం కొనసాగించాలని కోరుతూ హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. అలాగే డబ్ల్యూసీడీ కార్యదర్శి అనిత రామచంద్రన్, ఆర్ ఒ బి చీఫ్ ఇంజనీర్‌లను కలిసి హాస్టల్ నిర్మాణాన్ని ఇతర ప్రాంతానికి మార్చాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేయడానికి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, హెచ్ఎఫ్ నగర్‌లో నిర్మించిన ఫంక్షన్ హాల్ పనులను త్వరగా పూర్తి చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. దానిని సర్కిల్ కార్యాలయంగా మార్చడం సరైంది కాదన్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను తాళం వేసి ఉంచడం అన్యాయమని, వెంటనే వినియోగానికి తెరవాలని, లేకపోతే ప్రజల తరపున తామే ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ స్థానిక నాయకులు కమటం నర్సింహా రెడ్డి, కంకర సురేందర్, గడ్డం శ్రీధర్, లక్ష్మయ్య, ఘనీ, కృష్ణ, మల్లేష్, రమేష్, మహేష్, శ్రీశైలం యాదవ్, కురుమూర్తి, అల్తాఫ్, పాల్, ఫయాజ్, రాహుల్ పటేల్, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నాం

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 13(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కుత్బుల్లాపూర్ ప్రజల శ్రేయస్సు, నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు.



## రాఘవేంద్ర కాలనీలో నూతన కమిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 13(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్(కుత్బుల్లాపూర్ డివిజన్)పరిధి రాఘవేంద్ర కాలనీ లో ఎం.పి లాడ్స్ ఫండ్స్ మరియు కాలనీ సభ్యుల సహకారంతో నూతనంగా నిర్మించిన కాలనీ కమిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి కమిటీ హాల్ ని ప్రారంభించిన బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి.ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు నారాయణ,వెంకటేశ్వర రెడ్డి,మల్లారెడ్డి,ఉమాపతి,మల్లేష్ గౌడ్, కోటేశ్వరరావు, సతీష్ ,బాలరాజు, నర్సింహా రెడ్డి,సతీష్ చక్రవర్తి,నల్లనాగుల కృష్ణ,పెద్దింటి సాయిలు, శ్రీనివాస్ ముదిరాజ్, నందు గౌడ్,సందీప్ గౌడ్,మహేష్,శ్రవణ్,వర్మ,శివ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
మంగళవారం 14 ఏప్రిల్ 2026

# రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ముందుకు రావాలి

**హెల్మెట్ ధారణ ప్రాణ రక్షణకే**

**గ్రామాల్లో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు**



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పటాన్ చెరు డీఎస్పీ ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవారం భానూర్, నందిగామ గ్రామాల్లో బీడీఎల్ సీఐ విజయ్ కృష్ణ ఆధ్వర్యంలో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు శాంతయ్య, విక్రమ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భానూర్ గ్రామంలో యముడి వేషధారణలో ఉన్న నటుడి ద్వారా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు రోడ్డు ప్రమాదాల ప్రమాదాలు, వాటి దుష్పరిణామాలు వివరించారు. హెల్మెట్ ధరించని వారికి గులాబీ పూలు అందజేసి ఇకముందు తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తామని హామీ తీసుకున్నారు. గ్రామ ప్రజలతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా నూతనంగా రోడ్ సేఫ్టీ కమిటీలు కూడా ఏర్పాటు చేశారు. డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరి ప్రాణం అమూల్యమని, ప్రస్తుతం అనారోగ్యాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు.

తీవ్ర గాయాలతో కుటుంబాలకు భారంగా మారుతున్న ఘటనలు పెరుగుతున్నాయని, ఎన్నో కుటుంబాలు రోడ్డు ప్రమాదాలతో నష్టపోతున్నాయని తెలిపారు. రోడ్లపై ఉన్న బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సమస్యలను పరిష్కరిస్తామని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి గుంతలను పూడ్చే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఐ విజయ్ కృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కమిటీలు రోడ్డు ప్రమాదాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని సూచిస్తూ, యువత వాహనాలు నడిపేటప్పుడు అన్ని వైపులా జాగ్రత్తగా పరిశీలిస్తూ నడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, కార్యదర్శులు రాజేందర్, రవికుమార్, బీడీఎల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## చిర్యాల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న బొంతు దంపతులు

నాగారం, ఏప్రిల్ 13:-(వాయిస్ టుడే) : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చీర్యాల గ్రామంలో ఆలయ ఫౌండర్, చైర్మన్, మాజీ కీసర మండల ఎంపీపీ మల్లారపు లక్ష్మీనారాయణ ఆహ్వాన మేరకు ఆలయంలో నిర్వహిస్తు 18వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్, నగర మాజీ మేయర్ బొంతు రాంమోహన్ మరియు బొంతు శ్రీదేవి యాదవ్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు తీసుకుని ప్రజల సుఖశాంతి, ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బొంతు దంపతులకు వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నేడు సహాపంక్తి భోనాలు

**మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**

నాగారం, ఏప్రిల్ 13:-(వాయిస్ టుడే): ఏఐసీసీ పిలుపు మేరకు ఏప్రిల్ 14 వ తేదీ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ల ఆదేశాల మేరకు కుల, మత, జాతి లకు అతీతంగా ఒకే చోట సహా పంక్తి భోజనం కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొంటారని, ఉదయం 11:00 గంటలకు సైబరాబాద్ కార్పొరేషన్, మేడ్చల్ సర్కిల్ మేడ్చల్ డివిజన్ (297) లోని రథంశాల దగ్గర అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి తర్వాత జరిగే అతిధుల ఉపన్యాసం మరియు సహా పంక్తి భోజనం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కావున మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జ్ లు ఏ,బి బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎస్సి, ఎస్టీ, బీసీ మైనారిటీ సెల్, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, సేవాదళ్, ఎన్ఎస్ యుఐ, అన్ని అనుబంధ సంఘాల నాయకులు కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.




## తక్కువ ధరకే బంగారం బురిడికొట్టించే గ్యాంగ్...

**నాగారం మాజీ వార్డ్ సభ్యులు సాయినాథ్ గౌడ్‌కు వల**

నాగారం, ఏప్రిల్ 13:-(వాయిస్ టుడే): మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం డివిజన్ లో ప్రజల బలహీనతను ఆసరా చేసుకొని కొందరు దుండగులు ప్రజల బలహీనతలను పసిగట్టి బురిడీ కొట్టించేందుకు ఒక గ్యాంగ్ నాగారం డివిషన్‌లో సంచరిస్తున్నదని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగారం డివిజన్ మాజీ వార్డ్ సభ్యులు చిన్నం రాజు సాయినాథ్ గౌడ్ తెలిపారు. సోమవారం తనకు పోన్ చేసి తక్కువ ధరకు బంగారం అమ్ముతామంటూ అగంతకులు కాల్ చేసి మాట్లాడారని తెలిపారు.. చీప్ అండ్ బెస్ట్ లో బంగారం ఇస్తామంటూ నమ్మబలికే మాటలతో సాయంకాలం లో సుమారు 6: 30గంటల ప్రాంతం లో (9581689660) (కాల్ మాట్లాడడానికి)ఫోన్ నెంబర్ నాకు పోన్ లో బంగారం తో కూడిన 9676470306 వాట్సప్ నెంబర్ తో ఒక వీడియో ను కూడా అగంతకులు చూపిస్తూ తనకు వీడియో కూడా పంపారని తెలిపారు. ఇవేమీ నమ్మలేని తను పోలీసు అధికారుల కు సమాచారం అందించినట్లు తెలిపారు. అలాగే పత్రికలకు, ప్రసార మాధ్యమాలలో అగంతకుల కాల్ రికార్డ్ మరియు వీడియోను పంపించి ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఇలాంటి విషయాలలో ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో ను అగంతకుల మాటలు నమ్మకుండా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వేనువెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించి ఇలాంటి మోసాలను అరికట్టాలని సాయినాథ్ గౌడ్ తెలిపారు. కష్టపడందే ఏది మనకు దక్కదని, అలాంటిది ఈ రోజుల్లో తక్కువ ధరకు బంగారం, లోన్లు, లాటరీ అని ఇలా ప్రజలను మోసం చేసే గ్యాంగ్ ల నుండి జాగ్రత్తగా ఉండాలని సాయినాథ్ గౌడ్ ప్రజలను ఒక ప్రకటనలో కోరారు.




## వెంకులోనిగుట్ట వేంకటేశ్వరస్వామి వారి విగ్రహా ప్రతిష్ఠకు సన్నాహాలు

నాగారం, ఏప్రిల్ 13:-( వాయిస్ టుడే): మేడ్చల్ జిల్లా నాగారం డివిజన్ కీసర మండలం లోని వెంకులోనిగుట్ట రాంపల్లి దాయరాలో స్వయంభువుగా పుట్టలోనుండి వెలుపడినటువంటి శ్రీ హేమాద్రి వెంకటేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమ సన్నాహాలు ప్రారంభం అయ్యాయి. మే నెలలో 7,8,9,న ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతున్న శుభతరుణంలో మన వంతులో భాగంగా శ్రేయోభిలాషి సేవ ట్రస్ట్ తరుపున స్వామి వారికి కృష్ణశిల రాయితో చేసిన శంకు, చక్ర, నామాలతో పాటు ఆవులకు గరుక స్తంభం కూడా ఇవ్వడానికి ఎస్ఎస్టి సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీ విష్ణు జగతి వప్పుకుని ఇవ్వడానికి నిర్ణయించుకున్న శుభసందర్భంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ లో గల అల్లాగడ్డ శ్రీ మారుతీ శిల్పకల మందిరం శిల్పి వీరాభాస్కరాచారికి అడ్వాన్స్ గా కొంత అమౌంట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విష్ణు జగతితో పాటు ఎస్ఎస్టి సభ్యులు కర్ర వెంకన్న, ఇందూరి తిరుపతిలు పాల్గొన్నారు, అలాగే శ్రీ హేమాద్రి వెంకన్న స్వామి వారికి ఎస్ఎస్టి సంస్థ తరుపున ఒక గిరి ఆవు మరియు ఒంగోలు అవుదుడను గుడి ట్రస్ట్ సభ్యులకు అందచేయడం జరిగింది.

## నిరుపేదలకు ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయ నిధి

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**ఒక లక్ష 90 వేల రూపాయల విలువైన ఎల్ఓసిల పంపిణీ**



పటాన్చెరు : ఆపత్కాల సమయంలో నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం డివిజన్ పరిధిలోని బీరప్ప బస్తీకి చెందిన కాజిం ఖాన్, బీరంగూడ డివిజన్ పరిధిలోని వందన పురి కాలనీకి చెందిన బండ ప్రభాకర్ లు మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి మంజూరైన ఒక లక్ష 90 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పత్రాలను సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

## ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక అడుగు

**:- ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**

**మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు శాశ్వత కార్యాలయ భవనం నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ. 98 కోట్ల మంజూరి..త్వరలో ప్రారంభం**



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు శాశ్వత కార్యాలయ భవనం నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ. 98 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేయడం పట్ల ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉప్పల్ భాగాయత్ లేఅవుట్ ఫేజ్-×××లో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ కార్యాలయ భవనం, ప్రాంతీయ ప్రజలకు మరింత మెరుగైన పౌరసేవలు అందించేందుకు దోహదపడుతుందని త్వరలోనే శంకుస్థాపన చేయడం జరిగుతుందని ఆయన తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కి, సంబంధిత శాఖ అధికారులకు ఎమ్మెల్యే హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మొదట స్థలాన్ని పరిశీలన చేశాం అని ఉప్పల్ అభివృద్ధి దిశగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

## అంబర్పేట్ బురుజు గల్లీలోని హనుమాన్ దేవాలయం స్లాబ్ నిర్మాణం



హైదరాబాద్, ఏప్రిల్ 13: అంబర్పేట్ బురుజు గల్లీలోని హనుమాన్ దేవాలయం నిర్మాణ పనుల్లో భాగంగా ఈరోజు స్లాబ్ నిర్మాణం చేపట్టారు. ఈ ఆలయ పనులు త్వర త్వరగా పూర్తి చేస్తామని అంబర్పేట్ దేవస్థానం సేవా సమితి సభ్యులు తెలిపారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా ఆలయ నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న స్థానికుల కల సహకారం కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోకే.దుర్గా ప్రసాద్ రెడ్డి, గడ్డం లక్ష్మణ్ గౌడ్,వై.శంకర్ గౌడ్, జె.సత్తిబాబు గౌడ్, పంజాల గిరిధర్ గౌడ్, ఎస్.వెంకటకృష్ణారెడ్డి, కే.గోపాల్ రెడ్డి,సంజీవ్ చారి, గడ్డం శ్రీధర్ గౌడ్ ,బి.సాయినాథ్ యాదవ్.ఏం శ్రీనివాస్ రెడ్డి, పంజాల శేఖర్ గౌడ్, చెంగలి సుధాకర్ ,కిషోర్ , నాగభూషణం ,రవీందర్ సింగ్ ( బబ్లు ),హనుమంత్ యాదవ్,లచ్చయ్య గుప్తా, దామోదర్ చారి, పూర్ణచందర్ గౌడ్, వేణుగోపాల్ చారి, పాల్గొన్నారు.

# చీర్యాల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



నాగారం, ఏప్రిల్ 13:-(వాయిస్ టుడే) చీర్యాల శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలలో మొదటి రోజు కళషాభిషేకం, విష్వక్సేనపూజ, అగ్ని ప్రతిష్ఠతో శ్రీ సుదర్శన నారసింహ హోమం వేదపండితుల మంత్రోచ్ఛారణతో ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీ నారాయణ చేతులు మీదుగా ఈ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. బ్రహ్మోత్సవాలలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చేమకూర మల్లారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిలకు ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీ నారాయణ వేదపండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలతో ఘనంగా ఆశీర్వచనం అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ చీర్యాల లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొనడం సంతోషంగా ఉందిని, మొదటి సారి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకొగానే ఎంపి టికెట్ వచ్చిందని, ఘన విజయం సాధించానని, ఎమ్మెల్యే కూడా గెలిచి మంత్రిగా కూడా అయ్యానని, ఈ లక్ష్మీ నరసింహస్వామి రాజకీయ నాయకులకు కూడా కొంగుబంగారమని, కలిసొచ్చే దేవుడని అయన కొనియాడారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించదలిచామని అన్నారు. జిల్లాల నుండే కాకుండా కొన్ని రాష్ట్రాల నుండి కూడా స్వామి వారి భక్తులు విచ్చేస్తున్నారని, మన యొక్క చీర్యాల లక్ష్మీ నరసింహస్వామి చరిత్ర దేశం అంతా పాకిందని, వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీహరి వెంకటేష్, మాధురి వెంకటేష్, సుధాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో బస్సు షెల్టర్లు అధ్వానం

**యుద్ధ ప్రాతిపదికన ఆధునికరించాలి...**

**ఆప్ నేతలు హేమ జిల్లోజు, బుర్ర రాము గౌడ్...**

**శాఖల మధ్య సమన్వయ లోపంతో ప్రయాణికులకు శాపం...**

**బస్సు షెల్టర్ల దుస్థితి పై టీజీఎస్ ఆర్టీసీ ఎండీ కి 'ఆప్' నేతల విన్నపం...**




సికింద్రాబాద్, ఏప్రిల్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): హైదరాబాద్ నగర వ్యాప్తంగా బస్సు షెల్టర్ల దుస్థితి అధ్వానంగా తయారైందని, వాటిని ఆధునీకరించాలని, బస్ షెల్టర్లు, పరిసర ప్రాంతాలు ఉన్న తీరు ను వివరిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలు టిజిఎస్ ఆర్టిసి ఎండి నాగిరెడ్డి ని సోమవారం బస్సు భవన్లో కలిసి ఆయనకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమ జిల్లోజు, వర్కింగ్ కన్వీనర్ బుర్ర రాము గౌడ్ లు మాట్లాడుతూ...

గాంధీ ఆసుపత్రి వంటి అత్యవసర ప్రాంతాల్లో కూడా బస్సు షెల్టర్లు లేవనీ, రోగులు, వృద్ధులు ఎండలో అవస్థలు పడుతున్నారనీ, యుద్ధ ప్రాతిపదికన అక్కడ షెల్టర్ ఏర్పాటు చేయాలిని కోరారు. ప్రతి షెల్టర్ వద్ద రూట్ మ్యాప్ బోర్డులు, సమాచార బోర్డులు లేకపోవడం వల్ల ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. షెల్టర్ల వెనుక మలమూత్ర విసర్జన నిలిపివేసి, బ్లీచింగ్ చల్లి శుభ్రపరచాలి" అని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగర ప్రయాణికుల కష్టాలను తీర్చడమే లక్ష్యం అన్నారు.

**ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం...**

ఈ సందర్భంగా ఎండీ నాగిరెడ్డి నేతలతో మాట్లాడుతూ.. బస్సు షెల్టర్ల నిర్వహణ, పరిశుభ్రత అంశాలు ప్రధానంగా జిహెచ్ఎంసి (జిహెచ్ఎంసి) పరిధిలోకి వస్తాయని తెలిపారన్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు జిహెచ్ఎంసి అధికారులకు లేఖలు రాశామని, మరోసారి రాస్తామని చెప్పారన్నారు. షెల్టర్లపై ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాన్ని జిహెచ్ఎంసి తీసుకుంటుందని, వాటి పర్యవేక్షణ ఆయా అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు చూడాలని ఆయన వివరించారు. దీనిపై స్పందిస్తూ 'ఆప్' నేతలు, ఆర్టీసీ, జిహెచ్ఎంసి, అడ్వర్టైజింగ్ ఏజెన్సీల మధ్య ఉన్న సమన్వయ లోపం వల్ల సామాన్య ప్రయాణికులు ఇబ్బంది పడటం అన్యాయమని మండిపడ్డారు. ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టేయకుండా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

**ఏప్రిల్ 20 న భారీ నిరసన...**

అధికారులు త్వరితగతిన స్పందించి క్షేత్రస్థాయిలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న (సోమవారం) ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు నేతలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ ట్రెజరర్ జావిద్ షరీఫ్, సీనియర్ నాయకులు దర్శనం రమేష్, కొడంగల్ శ్రీనివాస్, రాకేష్ రెడ్డి, అజీమ్ మౌలాలి, ఇస్మాయిల్, అడ్వకేట్ ఆదాం, జై సింగ్ జాదవ్, ఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## బధిరుల క్రికెట్ టోర్నమెంట్లో విజేతగా తెలంగాణ రాష్ట్ర మహిళా క్రికెట్ జట్టు

సికింద్రాబాద్, ఏప్రిల్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర బధిర క్రికెట్ సంఘం (టిఎస్ క్యాడ్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 7 నుండి 9 వరకు మొదటి మధిర మహిళల జాతీయ క్రీడ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలో తెలంగాణ, విదర్భ, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల జట్ల పాల్గొన్నారు. మొదటి విజేతగా తెలంగాణ రాష్ట్ర మహిళల జట్టు, రెండవ విజేతగా విదర్భ జట్టు నిలిచింది. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు టీఎస్ క్యాడ్ అధ్యక్షులు టి చిరంజీవి, టి రేవతి, ప్రధాన కార్యదర్శి వి వి ఎస్ ఎల్ కె ఎం ప్రసాద్, హారతి ప్రసాద్ లు మొదటి బహుమతిగా 1,52,000/- రెండవ బహుమతిగా 75,200/- అందజేశారు. రన్నరప్ గా నిలిచిన టీమ్ లకు ట్రోఫీలు బంగారు, వెండి పథకాలు అందజేశారు. మ్యాచ్లోని మహిళలందరికీ సిరీస్ బెస్ట్ ప్లేయర్లకు, సిరీస్ బెస్ట్ బ్యాటర్లకు, బెస్ట్ బౌలర్లకు నగదు బహుమతులు అందజేశారు.

## ఇంటర్ ఫలితాల్లో మెరిసిన ఆణిముత్యం కస్తూరి సాయి తేజ...

**అత్యధిక మార్కులు సాధించిన గంభీరావుపేట విద్యార్థి...**



సికింద్రాబాద్, ఏప్రిల్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలలో వెయ్యి మార్కులకు గాను తొమ్మిది వందల ఏనుబై రెండు మార్కులు సంపాదించిన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట (మండలం) గ్రామానికి చెందిన విద్యార్థి కస్తూరి సాయి తేజ. సాయి తేజ విద్యా బ్యాసం పదవ తరగతి వరకు గంభీరావుపేట గ్రామంలోనే కొనసాగింది. ఇంటర్మీడియట్ చదువుకు హైదరాబాద్ బాచుపల్లి లోని ఎన్నారై కాలేజ్ లో హాస్టల్లో ఉండి చదువుతూ మంచి మార్కులు సంపాదించాడు. ఈ సందర్భంగా సాయి తేజకు విద్యా సంస్థ ప్రిన్సిపల్ రమేష్ రెడ్డి వైస్ ప్రిన్సిపల్ జయ కిరణ్, లెక్చరర్స్ తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్తులో పై చదువుల్లో నూ ఉన్నతంగా ఎదగాలని వారు ఆశీస్సులతో అభినందించారు.

## అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలే ఆయుధం

**చిన్నపాటి నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారి తీస్తోంది**

**హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక అధికారి ఏ.శ్రీదాస్, ఓయూ విసి ప్రొఫెసర్ కుమార్...**

**ఓయూలో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ...**



సికింద్రాబాద్,ఏప్రిల్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): చిన్నపాటి నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, ముందస్తు జాగ్రత్తలే అగ్ని ప్రమాద నివారణకు ఆయుధాలని హైదరాబాద్ జిల్లా అగ్నిమాపక అధికారి ఏ.శ్రీదాస్, ఓయూ వైస్ చాన్సర్ ప్రొఫెసర్ కుమార్ లు పేర్కొన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న కొద్దీ అగ్ని ప్రమాదాల ముప్పు అధికమవుతుందని, ఇళ్లలో,కార్యాలయాల్లో, పరిశ్రమల్లో సరైన భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలపై రూపొందించిన పోస్టర్,పాంప్లెట్లను ఓయూ పరిపాలనా భవనంలో వైస్ చాన్సర్ ప్రొఫెసర్ కమార్ మొలుగారం, హైద రాబాద్ జిల్లా అగ్నిమాపక అధికారి ఏ.శ్రీదాస్ అగ్నిమాపక అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగాహైద రాబాద్ జిల్లా ఫైర్ అధికారి శ్రీదాస్ మాట్లాడుతూ విద్యుత్ వైర్ల పాడుబడి ఉండటం, ఓవర్లోడ్ ప్లగ్ల వినియోగం, గ్యాస్ సిలిండర్ల నిర్లక్ష్య వినియోగం ప్రధాన కారణాలుగా గుర్తిస్తున్నారని,విద్యుత్ పరికరాలను సమయా నుకూలంగా తనిఖీ చేయడం,నాణ్యమైన వైర్లు ఉపయోగించడం అత్యవసరమన్నారు.గ్యాస్ లీకేజీ అనుమా నం వచ్చిన వెంటనే మంటలు వెలిగించకుండా, గాలి ప్రసరణ కల్పించి సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పరిశ్రమలు, వాణిజ్య సముదాయాల్లో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసి,వాటి వినియోగంపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. పాఠశాలలు, అపార్ట్మెంట్లలో కూడా అగ్ని ప్రమాదాలపై అవగా హన కార్యక్రమాలు నిర్వహించడం అవసరమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే అగ్ని ప్రమాదా లను సమర్థం గా ఎదుర్కొనగలమన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా అగ్ని ప్రమాదా నివారణకు తీసుకో వాల్సిన జాగ్రత్తలు, అనుకోని పరిస్థితుల వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే వాటి నుంచి ఆస్తి, ప్రాణ నష్టం జరుగుకుండా చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో మౌలాలి అగ్నిమాపక కేంద్రాధికారి రామ కృష్ణ రెడ్డి, సికింద్రాబాద్ అగ్నిమాపక కేంద్రాధికారి శంకర్, అగ్నిమాపక కేంద్రం మౌలాలి లీడింగ్ ఫైర్ ఫైటర్స్ గోవిందు, సాయి కిరణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంసెట్, నీట్ మోడల్ పరీక్షలు... విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి




**ఎస్ ఎఫ్ ఏ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కే అశోక్ రెడ్డి...**

సికింద్రాబాద్, ఏప్రిల్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నీట్ కు సన్నద్ధమయ్యే పేద విద్యార్థుల కొరకు ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య పర్యవేక్షణలో ఎస్ ఎఫ్ ఏ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 28 వరకు మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలు జరగనున్నాయనీ, గ్రామీణ, పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఎ) హైదరాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శి కే అశోక్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ లోని రాష్ట్ర కార్యాలయంలో సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. గత 18 ఏండ్ల నుంచి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సారి రాష్ట్ర వ్యాప్తంగా 300 కేంద్రాలలో ఈ మోడల్ పరీక్షలు ఆన్లైన్ తోపాటు ఆఫ్లైన్ లోనూ జరుగుతాయన్నారు. రాష్ట్రంలో అత్యంత నిష్ణాతులైన, అనుభవం ఉన్న ఫ్యాకల్టీ పర్యవేక్షణలో ప్రశ్నాపత్రాలను రూపొందించి పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. కార్పొరేట్ కాలేజీలు ఎంసెట్, నీట్, జేఈఈ కోచింగ్ పేరుతో ఏడాదికి లక్షల రూపాయలు దండుకుంటున్నాయని విమర్శించారు. పేద విద్యార్థులకు అవకాశం లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి కోసమే మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలను నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నీట్ కి సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఇది రాయడం వల్ల మెళకువలు తెలుస్తాయని, సబ్జెక్టుపై అవగాహన పెరుగుతుందని వివరించారు. ఈ పరీక్షల్లో విజయం సాధించిన టాప్ పది మంది విద్యార్థులకు బంగారు పతకాలను బహుకరిస్తామని చెప్పారు. విద్యార్థుల తరుపున పోరాటాలే కాకుండా, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఎస్ఎఫ్ఐ ఈ తరహా మోడల్ పరీక్షలను నిర్వహిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు , 9030881429, 9515166907 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, ఉపాధ్యక్షులు కిరణ్, మమత హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్, ఉపాధ్యక్షులు రజనీకాంత్, నాగేందర్, ప్రవీణ్, ఆంజనేయులు, కార్తీక్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వత్తిడితో వ్యక్తి ఆత్మహత్య

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని జనప్రియ నీల్ వ్యాలీ అపార్ట్మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న యువకుడు. చందానగర్ లో నివాసం ఉంటున్న వంశీ శేషగిరి (29) అనే వ్యక్తి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, మరోపక్క మూడు నెలల నుండి ఉద్యోగం లేక మానసిక ఒత్తిడికి గురై అమీన్పూర్లో ఉన్న జనప్రియ అపార్ట్మెంట్ తన అక్క బావ దగ్గరికి వచ్చిన వంశీ శేషగిరి ఇంట్లో ఎవరూ లేని సమయంలో 12వ అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న అమీన్పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## కామ్రేడ్ నూర్జన్‌కు ఘన నివాళులు

**పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం -- ఆశ వర్కర్స్ యూనియన్ పిలుపు**

కూకట్‌పల్లి; ఏప్రిల్ 13(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ నూర్జన్కు తెలంగాణ రాష్ట్ర ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం నిర్వహించిన ఈ స్మారక కార్యక్రమం భావోద్వేగపూరితంగా సాగింది. కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఆమె సేవలను స్మరించుకున్నారు. నూర్జన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ కూకట్‌పల్లి నాయకురాలు సబియా మాట్లాడుతూ, నూర్జన్ మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆమె ఆశ, అంగన్వాడీ, బీడీ కార్మికులు, మధ్యాహ్న భోజన సిబ్బంది వంటి అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించారని తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా వెనుకడుగు వేయకుండా, కార్మికుల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన యోధురాలిగా నూర్జన్‌ను గుర్తుచేశారు. "తన చివరి శ్వాస వరకు కార్మికుల సంక్షేమం కోసం కృషి చేసిన నూర్జన్ ఆశయాలను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్టవుతుంది" అని సబియా అన్నారు. నేటి తరానికి ఆమె పోరాట స్ఫూర్తి మార్గదర్శకమని, సమాన హక్కుల సాధన దిశగా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల, సోమలత, మంజుల, పుష్ప, నజియా తదితరులు పాల్గొన్నారు. "నూర్జన్ జీవితం -- కార్మిక హక్కుల కోసం అంకితభావం... ఆమె స్ఫూర్తి మన పోరాటాలకు మార్గదర్శకం!"



## 21 అర్ధరాత్రి నుండి ఆర్టీసీ కార్మికుల సమ్మె

**ఆర్టీసీ కార్మికుల చర్చలు విఫలం..సమ్మెకు సైరన్**

సికింద్రాబాద్, ఏప్రిల్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): ఆర్టీసీ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న మొండి వైఖరికి నిరసనగా ఈనెల 21 అర్ధరాత్రి నుండి సమ్మెకు వెళ్తున్నట్లు టిజిఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు ఈదురు వెంకన్న ప్రకటించారు. కార్మికుల సమస్యలపై పలుమార్లు నోటీసులు అందించినా ప్రభుత్వం నుండి గాని, యాజమాన్యం నుండి గాని ఎలాంటి స్పందన లేదని, లేబర్ కమిషనర్ తో సోమవారం ఆర్టీసీ జేఏసీ నాయకులు జరిపిన చర్చలు విఫలమయ్యాయని, నిరసనగా ఈనెల 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు స్పష్టం చేశారు. కార్మికులను బలవంతంగా సమ్మెలకు నెట్టే లా యాజమాన్యం వ్యవహరిస్తుందని, కొత్త డిమాండ్లు ఏవి అడగలేదని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టిసి ని ప్రభుత్వంలో విలీనం చేయాలని, సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని, తదితర 32 డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచామన్నారు. ఆర్టీసీ విలీనం యూనియన్ ఎన్నికల కోసం కమిటీ వేసామని మంత్రి చెబుతున్నారని, ఇంతవరకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయలేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు సమస్యలు విన్నవిస్తున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**21 అర్ధరాత్రి నుండే సమ్మె...**

ఆర్టీసీ కార్మికుల నిర్వహించనున్న స సమ్మె ఈనెల 21 అర్ధరాత్రి నుండి మొదలవుతుందని, ఏ ఒక్క కార్మికుడు 22వ తేదీ మొదటి డ్యూటీ నుంచి విధులకు హాజరు కాకూడదని జేఏసీ పిలుపునిచ్చింది. 40 వేల మంది కార్మికులు జేఏసీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నారని టిజిఎస్ ఆర్టిసి జేఏసీ ప్రకటించింది. ఎవరైనా వేరే ఆలోచనలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించింది.

## ఐదవ అంతస్తు పెంట్‌హౌస్ నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



కూకట్ పల్లి; ఏప్రిల్ 13(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని స్థానిక నివాసి సలాని భీమారావు (51), తండ్రి రమణ, సోమవారం మధ్యాహ్నం సుమారు 1 గంట సమయంలో శ్రీరామ్ నగర్ కాలనీలో తన నివాసంలోని ఐదవ అంతస్తు పెంట్‌హౌస్ నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అందిన సమాచారం ప్రకారం, భీమారావు గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసై తరచూ మద్యం సేవించేవాడు. నిన్న అతని బావమరిది మరణించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, అప్పటి నుంచి నిరంతరం మద్యం సేవిస్తూ ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘోర నిర్ణయం తీసుకున్నాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో కాలనీలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు షాక్‌కు గురయ్యారు. మానసిక ఒత్తిడులు, వ్యసనాలు జీవితాన్ని నాశనం చేయగలవు. ఇలాంటి సమస్యలు ఉంటే వెంటనే కుటుంబ సభ్యులు లేదా నిపుణులను సంప్రదించడం మంచిది.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీపీ మండల్ సిఫారసులను అమలు చేయాలి

**బీపీ మండల్‌కు భారతరత్న కేటాయించాలి...**

**ట్యాంక్ బండ్‌పై మండల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి...**

**యాదవ జేఏసీ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్...**



సికింద్రాబాద్, ఏప్రిల్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): బీపీ మండల్ సిఫారసులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని యాదవ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ జేఏసీ ఆధ్వర్యంలో యాదవ రాజకీయ సదస్సును నిర్వహించారు. బీపీ మండల్ (బిందేశ్వర ప్రసాద్ మండల్) 44 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను కల్పించిన ఘనత బీపీ మండల్ కే దక్కుతుందన్నారు. బీపీ మండల్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలనీ, ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో బీపీ మండల్ ఉద్యమం ద్వారానే యాదవులు ముఖ్యమంత్రి అయ్యారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనూ మరో మండల్ ఉద్యమం గ్రామ గ్రామాన చేపడతామన్నారు. పార్లమెంట్ లో బీపీ మండల్ విగ్రహం ఏర్పాటు చేయాలనీ కోరారు. 70 కోట్ల ఓబీసీల ఆరాధ్య దైవం బీపీ మండల్ జయంతి, వర్ధంతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అధికారంగా నిర్వహించాలన్నారు. బీపీ మండల్ జీవిత చరిత్రను పాఠ్యాంశ పుస్తకాలలో చేర్చాలన్నారు.తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాలు, బహుజన కులాలను కలుపుకొని యాదవులు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ జేఏసీ వైస్ చైర్మన్ చిలుకల శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధి రమేష్ యాదవ్,ప్రధాన కార్యదర్శి బీనవేని మల్లేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు మేకల శివశంకర్ యాదవ్,గంగుల మధు యాదవ్,బెల్లి చంద్రశేఖర్ యాదవ్,ప్రధాన కార్యదర్శి బీనవేని మల్లేష్ యాదవ్,ఉపాధ్యక్షుడు దారమోనీ బక్కన్న యాదవ్,కార్యదర్శులు కడారి కాశీం,తోకల మహేష్ యాదవ్,గడ్డం శ్రీనివాస్ యాదవ్,యూత్ అధ్యక్షుడు నారమోని నరేష్ యాదవ్,మహిళా అధ్యక్షురాలు మంజుల వాణి యాదవ్, లీగల్ సెల్ అధ్యక్షుడు జుర్రు అరుణ్ యాదవ్,మీడియా గౌరవ అధ్యక్షుడు భేరి రామచందర్ యాదవ్,ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజి యాదవ్,మీడియా కన్వీనర్ ప్రశాంత్ యాదవ్,సలహాదారులు చిట్టబోయిన నంద కిషోర్ యాదవ్,బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్,టీఆర్ పీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాండు యాదవ్,అంబర్ పేట్ శ్రీనివాస్ యాదవ్,ఈశ్వరమ్మ యాదవ్,అడ్వకేట్ నాగుల శ్రీనివాస్ యాదవ్,ప్రొఫెసర్ నాగుల వేణు యాదవ్,నక్క శ్రీనివాస్ యాదవ్,పలువురు యాదవ జేఏసీ నేతలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...

సికింద్రాబాద్, ఏప్రిల్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): ఎంబీఏ చదువు పూర్తి చేసుకుని 20 సంవత్సరాల అయిన సందర్భంగా పడాల రామ్ రెడ్డి కాలేజ్ ఎంబీఏ ( 2004-06 బ్యాచ్ ) పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. దశాబ్దాల క్రితం విడిపోయిన స్నేహితులు, తోటి విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. మళ్లీ అదే కళాశాలలో ఒక చోట కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ పడాల శ్రీనివాస్ రెడ్డి, హెచ్ ఓ డి శేఖర్, అధ్యాపకులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పూర్వ విద్యార్థులు శ్రీరాములు, పవన్ ఉప్పలూరి, అనురాధ కాట్రెడ్డి, సురేష్ మద్దెల నేతృత్వంలో ఘనంగా జరిగింది.



## ఈద్ మిలాఫ్.. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్

జూబ్లీహిల్స్ 13 ఏప్రిల్ వాయిస్ టుడే : సోమాజిగూడ డివిజన్‌లో అన్నదాన కార్యక్రమం సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో రంజాన్ పండుగ కోసం ఇఫ్తార్ పార్టీ.. మస్జీద్ బడ్జెట్‌కు ప్రభుత్వం తరపున రూ.1 లక్ష మంజూరు చేసిన సందర్భంగా ఈద్ మిలాద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1000 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ హాజరై స్వయంగా అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జామా మస్జిద్ హుస్సేని కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు : స్థానిక మాజీ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్.అబ్దుల్ మాహీద్ సయ్యద్ జ్ఞ?వీడ్ హుస్సేన్ షేక్ అహ్మద్.. సయ్యద్ తహర్.. నసీర్.కిరణ్ యాదవ్.. సాయినాథ్ యాదవ్. చిన్న యాదవ్ ఇతరులు పాల్గున్నారు..

## వసతి కల్పించకుండా యూనివర్సిటీ అధికారుల కుట్ర

**వసతులకు నోచని భీమా హాస్టల్...**

**ముఖ్యమంత్రి ప్రారంభించిన బీమా హాస్టల్...**

**ఎబివిపి ఓయూ సెక్రటరీ మోక్షిత్...**



సికింద్రాబాద్, ఏప్రిల్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): ఇంజినీరింగ్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని నూతనంగా నిర్మించిన భీమా హాస్టల్ ను రాష్ట్ర ముఖ్య మంత్రి అంగరంగ ప్రారంభించి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ, అధికారులు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురాకపోవడన్నీ విద్యార్థి లోకాని తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోందనీ ఎబివిపి ఓయూ సెక్రటరీ మోక్షిత్ మండిపడ్డారు. ఇప్పటికే ఉన్న పాత హాస్టల్స్ లో పైకప్పు పెచ్చులు ఊడుతూ అధ్వానంగా ఉన్నాయనీ, గదుల కొరత, మౌలిక సదుపాయాలు,పరిశుభ్రత లోపం వంటి సమస్యలతో ఉన్నటువంటి వాటిలో విద్యార్థులను ఉంచటం అంటే విద్యార్థుల యొక్క వసతి, క్షేమం ల పై అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతూ కళాశాల అధికారులను ప్రిన్సిపల్ ను ఆశ్రయించిన కొత్త హాస్టల్ ను ప్రారంభించ కుండా రోజు రోజు కాలం వెల్లదియటం సిగ్గుచేటనీ అన్నారు. బీమా హాస్టల్లో విద్యార్థులు లేని కారణంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందన్నారు. విద్యార్థుల యొక్క క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన విద్యార్థుల కెపాసిటీ అనుగుణంగా బీమా హాస్టల్ ను కేటాయించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఎబివిపి కార్యకర్తలు బీమా హాస్టల్ ను ప్రారంభించి విద్యార్థులకు న్యాయం చేసే దిశగా అడుగులు వేస్తామని హెచ్చరించారు.




## ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

**సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సికింద్రాబాద్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శరత్ శ్యామ్**

హైదరాబాద్, ఏప్రిల్ 13: ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సికింద్రాబాద్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శరత్ శ్యామ్ అన్నారు. జోన్ అధ్యక్షుడు ఎస్.నారాయణ రెడ్డి అధ్యక్షతన సోమవారం కాచిగూడ లోని అభినందన్ గ్రాండ్ లో జోన్ కమిటీ ప్రతినిధుల సమావేశం జరిగింది. వచ్చే బక్రీద్, బోనాల పండుగలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పండుగల సమయంలో ప్రజలకు, పోలీసు శాఖకు మధ్య వారధిలా పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. పండుగల సమయంలో ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా సమస్యను పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి అబ్దుల్ ఖాదర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాడపు చంద్రశేఖర్, ఆరాఫత్ యాదుల్లా, సదయ్యద్ ఫరీదుద్దీన్ యూనస్, సయ్యద్ ఖాలీద్ షా చిస్తీ, డాక్టర్ ఉదయ శ్రీ, సయ్యద్ అబ్దుల్ కబీర్, మహ్మద్ ఆలీ, మున్నా నాయక్, బసంత్ కౌర్, శ్రీలత, మల్లం రమేష్, సయ్యద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలి

**ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం**

**అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలి.**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**రోడ్డు భద్రత వాల్ పోస్టర్ ను అవిష్కరించిన జిల్లా కలెక్టర్**



కరీంనగర్,ఏప్రిల్ 13(వాయిస్ టుడే): ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు.కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తోన్న అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత వారోత్సవాల వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ప్రతి ఒక్కరు సహకరించాలని పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం,మద్యం తాగి వాహనాలు నడప వద్దన్నారు. మొబైల్ ఫోన్ వినియోగం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు.హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు.టూ వీలర్ వాహనదారులు ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని కోరారు.ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.పాదచారులు కూడా జాగ్రత్తగా రోడ్లు దాటాలని, నిర్దేశిత జీబ్రా క్రాసింగ్‌లను వినియోగించాలని చెప్పారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సూచించారు.స్పష్టం చేశారు.ఇందులో భాగంగా ఈనెల 16వ తేదీన సుభాష్ నగర్ లోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కాలేజీలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఇందులో విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు ఆటో రిక్షా డ్రైవర్లకు మెడికల్ చెకప్ నిర్వహిస్తారని తెలిపారు. అదేవిధంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు డ్రైవర్లకు రోడ్ సేఫ్టీ పై అవగాహన కల్పిస్తారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ పురుషోత్తం,జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి ఎంవీఐ రవికుమార్ రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ మెంబర్,ఎన్జీవో నీలం సంపత్ పాల్గొన్నారు.



## శ్రీ చైతన్య స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ఖమ్మం,ఏప్రిల్ 13 ( వాయిస్ టుడే ): ప్రీ-ప్రైమరీ విద్యార్థులు మొదటి తరగతిలోకి అడుగుపెడుతున్న సందర్భంలో, అలాగే ప్రైమరీ విద్యార్థులు ఆరవ తరగతిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమం ఆత్మీయ స్వాగతంతో ప్రారంభమై, విద్యార్థుల అందమైన సాంస్కృతిక ప్రదర్శనలతో కొనసాగింది. చిన్నారులు నృత్యాలు, రైమ్స్ మరియు ప్రసంగాలతో అందరినీ అలరించారు. గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో చిన్నారులు ఎంతో ఆకర్షణీ యంగా కనిపించారు. ఈ కార్య క్రమంలో విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల విజయాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ ,డైరెక్టర్ శ్రీ విద్య, ఏజీఎం చేతన్,ప్రిన్సిపల్ నీరజ,ప్రైమరీ కోఆర్డినేటర్ పార్వతి, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ గౌతమి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జి గీత,ప్రైమరీ ఇంచార్జ్ రేణుక ,హైస్కూల్ డీన్ ఉమా ఉపాధ్యాయులు,విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బిల్డర్స్ అసోసియేషన్ పేరుతో జోరుగా అక్రమ నిర్మాణాలు

**ప్రభుత్వ చట్టాలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు**

**ఆర్థిక బలంతో అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న బిల్డర్లు**

**ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో గండి కొడుతున్న బిల్డర్ల పై చర్యలేవి...?**

**ఫిర్యాదు చేసిన పత్రికలో కథనాలు వచ్చిన బెదిరింపులకు దిగుతున్న బిల్డర్లు**

**బిల్డర్లు చేసే అక్రమ నిర్మాణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేయించాలి**

**సికింద్రాబాద్ జోన్ డీసీపీకి దళిత చైతన్య సంఘం పిర్యాదు**



సికింద్రాబాద్, ఏప్రిల్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి): మున్సిపల్ చట్టాలను ఉల్లంఘిస్తూ, ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న బిల్డర్లపై (భవన నిర్మాణదారులపై) కఠిన చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షితమూర్తికి దళిత చైతన్య సంఘం కోరింది.ఈ మేరకు దళిత చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ సోమవారం వారి బృందం మధుసూదన్, బాలకృష్ణలతో డీసీపీని కలిసి లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ అని పెట్టుకుని జిహెచ్ఎంసి నిబంధనలు అసలు పాటించకుండా ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు చేస్తున్నారని, వీళ్లు చేసే నిర్మాణాలు అక్రమం అని సంబంధిత జిహెచ్ఎంసి అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేసిన పత్రికలో కథనాలు రాసిన వారిని బెదిరిస్తున్నారని డీసీపీకి వివరించారు. సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామ్ సుందర్ అనే వ్యక్తి ఆర్ట్స్ కాలేజ్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ కు ఆనుకుని భారీ అక్రమ నిర్మాణమును నిర్మించాడనీ, జిహెచ్ఎంసి నుండి జీ ప్లస్ టూ అనుమతి తీసుకుని జిహెచ్ఎంసి చట్టానికి వ్యతిరేకంగా భారీ సెల్లార్ తవ్వారనీ, మూడు అంతస్తులు అక్రమంగా,అదనంగా నిర్మించాడన్నారు. ఈ అక్రమ భవనంపై స్థానికులు పలుమార్లు జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేయగా జిహెచ్ఎంసి అధికారులు స్పందించి ఆ భవనానికి నోటీసులు ఇచ్చి మూడు సార్లు సీజ్ కూడా చేశారన్నారు. అయిన ఆ నిర్మాణదారుడు అదేమీ లెక్క చేయకుండా నిర్మాణాన్ని పూర్తిచేసి ఫంక్షన్ హాల్ నిర్మించాడనీ, ఈ భవనం అక్రమ నిర్మాణం అని తాను జిహెచ్ఎంసి కమిషనర్ కు, సికింద్రాబాద్ జోన్, జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేయగా సదరు నిర్మానదారుడు ఆ విషయం తెలుసుకుని ఇతరులతో తనకు ఫోన్ చేపించారనీ చెప్పారు. నేను అతనికి లొంగక పోవడంతో చేసేదేమీ లేక తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ జిహెచ్ఎంసి జోనల్ కార్యాలయంలో, సికింద్రాబాద్ జోన్ డిసిపి కి కూడా పిర్యాదు చేశారని ముప్పిడి తెలిపారు. ఇదే కాకుండా బిల్డర్స్ అసోసియేషన్ పేరుతో ఏర్పాటు చేసిన అసోసియేషన్ లో ఉన్న బిల్డర్లు అందరూ అక్రమ నిర్మాణాలు చేస్తూ ఎవరైనా ఫిర్యాదు చేసిన రిపోర్టర్లు పత్రికలలో కథనాలు రాసిన వాళ్లని బెదిరించడం, భయభ్రాంతులకు గురి చేయడం జరుగుతుందని వాళ్ల మాట వినకుంటే వాళ్లపై పగని ఆపెంచుకొని అక్రమ కేసులు పెడుతున్నారని వివరించారు. బిల్డర్స్ అసోసియేషన్ లో ఉన్న సభ్యుల పూర్తి వివరాలు సేకరించి వాళ్లు తీసుకున్న అనుమతులు ప్రస్తుతం నిర్మాణాల పరిస్థితి పై పూర్తిగా ఎంక్వయిరీ చేసి తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిసిపి ని కోరారు. వెంటనే స్పందించిన డిసిపి జిహెచ్ఎంసి అధికారుల నుండి భవన నిర్మాణ అనుమతుల నకలు తీసుకుని ప్రస్తుత వాటి నిర్మాణ పరిస్థితి తెలుసుకొని కావాలని తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తమకు హామీ ఇచ్చారని నవీన్ కుమార్ మాదిగ తెలిపారు.

# మాజీ స్పీకర్ శ్రీపాదరావు వర్ధంతి

**బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన శ్రీపాదరావు**

**శ్రీపాద రావు చూపిన బాటలో నడుస్తాం ఆయన కన్న కలలను సాకారం చేయడమే మా లక్ష్యం**

**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**తండ్రి ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్న మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు**

**మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం**




కరీంనగర్,ఏప్రిల్ 13(వాయిస్ టుడే): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు కరీంనగర్ డిసిసి కార్యాలయంతో పాటు నగరంలోని బస్టాండ్ కూడలి వద్ద శ్రీపాదరావు వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై మాజీ ఎమ్మెల్యేలు కటకం మృత్యుంజయం,ఆరేపల్లి మోహన్, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బస్టాండ్ కూడలి వద్ద కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నేతలు హాజరై శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పార్టీ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే, కటకం మృత్యుంజయం మాట్లాడుతూ అజాతశత్రువు ప్రజలు మెచ్చిన నేత శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, వారు శాసనసభ స్పీకర్ గా రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసిన నేతగా, ప్రజాప్రతినిధిగా మారుమూల గ్రామంతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంతోమంది అభిమానులను సంపాదించుకొని రాజకీయాలలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న శ్రీపాదరావు స్వర్గస్తులవడం దురదృష్టకరం,వారు విలువలతో కూడిన రాజకీయాలు చేసి నేటి తరానికి ఆదర్శవంతులుగా ఆరోజు వారు చేసిన అభివృద్ధి వారు చూపిన బాటలో నడుస్తూ వారి తనయుడు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శ్రీపాద రావు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కన్న కలలను సహకారం చేయడమే లక్ష్యంగా వారి ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్నారు, మేమంతా వారి అడుగుజాడల్లో నడుస్తూ కంకణ బద్ధులమై పనిచేస్తామని శ్రీపాద రావు ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిన బూనుచున్నాము అని,ఈ సందర్భంగా ఆ మహనీయుని సేవలను స్మరించుకుంటూ కరీంనగర్ పట్టణంలో పేదల కోసం అన్నదానం కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలలో మల్లికార్జున రాజేందర్,ఎండి తాజ్, కర్ర రాజశేఖర్ బానోతు శ్రావణ్ నాయక్,వరాల నరసింగం,పడుశెట్టి భూమయ్య, వేల్పుల వెంకటేష్,ఆకుల నరసయ్య,గుమ్మడి రాజకుమార్, పర్వత మల్లేశం,చడ గొండ బుచ్చి రెడ్డి,సరిల్లా ప్రసాద్,కామ్రెడ్డి రాంరెడ్డి,చర్ల పద్మ, మునిగంటి అనిల్ నిహాలైమ్మద్,వంగల విద్యాసాగర్, సుధాకర్ నాయక్,కుంభాల రాజకుమార్,దిండిగాల మధు,వెన్న రాజ మల్లయ్య,బాకారపు శివయ్య, మూల జైపాల్, కల్వల రామచందర్, రాచకొండ ప్రభాకర్,రాచర్ల పద్మ, అస్తపురం రమేష్,కామ్ పెల్లి కీర్తి కుమార్,సుదర్శన్,పిట్టల రవి, గంగుల దిలీప్,లైక్,జొన్నల రమేష్,రూపు రెడ్డి శ్రీనివాసరెడ్డి,తోట అంజన్న,హర్ష మల్లేశం,దండి రవీందర్,పడాల అజయ్,వీర దేవేందర్,కమ్రుద్దీన్ అబ్దుల్ బారి, సుకూర్, షబానా, నాగుల సతీష్, జ్యోతి రెడ్డి,ఖాజా ఖాన్,కిరణ్, మామిడి సత్యనారాయణ రెడ్డి,శిల్ప, స్వప్నశ్రీ, సద్దాం,ఊరడి లత,ఇమ్రాన్, అనిల్, బత్తిని చంద్రయ్య గౌడ్,ఏజ్రా, జీడి రమేష్,చాంద్,మంద మహేష్, సుంకర గణపతి,మాసూమ్ ఖాన్ సిరాజ్ ,వాసు,ఊకంటి రవీందర్ రెడ్డి,అష్రాఫ్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయి కథలు, కవితలకు ఆహ్వానం

**– 8వ వార్షికోత్సవ సభలో విజేతలకు నగదు బహుమతులు : వురిమళ్ల సునంద**



ఖమ్మం, ఏప్రిల్ 13 ( వాయిస్ టుడే): వురిమళ్ల ఫౌండేషన్ 8వ వార్షికోత్సవం సందర్భంగా 2026 సంవత్సరానికి గాను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించనున్న కథలు, కవితల పోటీలకు రచనలు ఆహ్వానిస్తున్నట్లు వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వురిమళ్ల సునంద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీల్లో ప్రథమ బహుమతి 5 వేలు, ద్వితీయ బహుమతి 4 వేలు, తృతీయ బహుమతి 3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండు కన్సోలేషన్ బహుమతులు ఇవ్వనున్నామని, ఒక్కో బహుమతికి వెయ్యి రూపాయల చొప్పున ఇస్తామని తెలిపారు. కథ చేతిరాతలో 5 పేజీలు, డిటిపి చేసి పంపిస్తే 3 పేజీలకు మించరాదని సూచించారు. ఏదైనా సామాజికాంశం మీద కథ ఉండాలని, హామీ పత్రం విడిగా రాసి జత చేయాలని సూచించారు. వురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీల్లో ప్రథమ బహుమతి 4 వేలు, ద్వితీయ బహుమతి 3 వేలు, తృతీయ బహుమతి 2వేలతో పాటు కన్సోలేషన్ బహుమతులను రెండింటికి వెయ్యి రూపాయల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. కవిత 25 లైన్లకు మించరాదని, ఏదైనా సామాజికాంశం మీద కవిత రాయాలని, హామీ పత్రం విడిగా జత చేసి పంపించలని సూచించారు. వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారిని ఎంపిక చేసి 'భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం' స్మారక పురస్కారంతో పాటు పది వేల నగదు బహుమతిని అందచేయనున్నట్లు తెలిపారు. అక్షరాలతోవ సాహిత్య సంస్థ సహకారంతో జరిగే వురిమళ్ల ఫౌండేషన్ 8వ వార్షికోత్సవ సభలో విజేతలకు బహుమతులు, పురస్కారాలు అందచేయనున్నట్లు తెలిపారు. కథలు, కవితలను మే 15, 2026 తేదీ నాటికి భోగోజు ఉపేందర్‌రావు, ఇంటి నెం.11-10-694/5, బురహాన్‌పురం, ఖమ్మం అనే చిరునామాకు పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు 9441815722 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.



## పిట్లం ప్రభుత్వ పాఠశాలలో పోలీస్ అవగాహన కార్యక్రమం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 13 (వాయిస్ టుడే) : కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పిట్లం పోలీస్ శాఖ పిట్లం సబ్ ఇన్స్పెక్టర్ బి ఆంజనేయులు విద్యాశాఖ అధికారి దేవి సింగ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిట్లం ఎస్సై బి. ఆంజనేయులు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పదవ తరగతి పరీక్షలు పూర్తైన నేపథ్యంలో వివిధ గ్రామాల నుంచి పరీక్షలకు హాజరైన విద్యార్థులకు భవిష్యత్తు లక్ష్యాలు నిర్దేశించుకోవడం, రహదారి నియమాలు పాటించడం, మైనర్ వయస్సులో వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలపై వివరించారు. వేసవికాలంలో చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లడం ప్రమాదకరమని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తెలియని వయస్సులో ఆకర్షణకు లోనై ప్రేమ వ్యవహారాల్లో చిక్కుకొని పోక్సో కేసులు నమోదు కావడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ, మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని, పుస్తకానికి దగ్గరగా ఉంటూ భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి దేవి సింగ్‌తో పాటు మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మీ భద్రతే మా లక్ష్యం : పోలీస్ కమిషనర్

**మీ భద్రత మా లక్ష్యం మని,భద్రత ప్రమాణాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని**

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



ముదిగొండ మండలం ఏప్రిల్ 13 వాయిస్ టుడే : రోడ్డు ప్రమాదాలలో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకుండా సురక్షితంగా గమ్యం చేరడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం,పోలీస్ శాఖ నిర్వహిస్తున్న "అరైవ్ ఆలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా వారం రోజుల పాటు నిర్వహిస్తున్న రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా ముదిగొండ పోలీసుల ఆధ్వర్యంలో వల్లభి లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ హాజరై రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ..రోడ్డు భద్రత నియమాలపైన అవగాహన లోపం వల్ల రోడ్డు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయన్నారునిర్ణీత వేగ పరిమితిని పాటించడం ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని అన్నారు. నిర్లక్ష్య డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం, ఓవర్ టేక్ వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. "సురక్షిత ప్రయాణం -- సంతోషకర గమ్యం" అనే లక్ష్యంతో అందరూ కలిసి పని చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రోడ్డు భద్రత అనేది పోలీసుల ఒక్కరి బాధ్యత కాదని, సమాజం మొత్తంగా ముందుకు వస్తేనే ప్రమాదాలను తగ్గించగలమని అన్నారు. 'అరైవ్ అలైవ్' ఒక ఉద్యమంగా మారాలి ఈ కార్యక్రమాన్ని కేవలం ఒక అవగాహన కార్యక్రమంగా కాకుండా, ప్రజా ఉద్యమంగా మార్చాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి వ్యక్తి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఇతరులను కూడా ప్రోత్సహిస్తేనే నిజమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ మురళి, ఎస్సైలు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రజల్లో చైతన్యం రావాలి

**ఖమ్మం త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ మోహన్ బాబు**

ఖమ్మం, ఏప్రిల్ 13 ( వాయిస్ టుడే ): రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రజల్లో మరింత చైతన్యం రావాలని ఖమ్మం త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ మోహన్ బాబు అన్నారు.దేశవ్యాప్తంగానే కాకుండా రాష్ట్రంలోనూ రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వీటి నియంత్రణ కోసం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుంచి 18 వరకు చేపట్టిన అరైవ్ -- అలైవ్ కార్యక్రమాలలో భాగంగా టౌన్ ఏసీపీ రమణమూర్తి పర్యవేక్షణలో నగరంలోని మిర్చి మార్కెట్ కు వచ్చే రైతులకు, ట్రాలీ డ్రైవర్లకు అవగాహన పెంపొందించేందుకు వీలుగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్ అలైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు సురక్షిత డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసి, రోడ్డు భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, కార్లలో సీటు బెల్టులు పెట్టుకోకపోవడం, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వాడడం, మద్యం సేవించి నడపడం, సిగ్నల్ జంప్, స్టాప్ లైన్ దాటడం, హైవేలపై ఆటోల ఓవర్ లోడింగ్, ఎడమవైపు నుంచి ఓవర్ టేకింగ్ వంటి ప్రమాదకర అలవాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉన్నదని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.



## పిట్లంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 13 (వాయిస్ టుడే) : కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పిట్లం గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ నూతన ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ప్రతినిధులు మాట్లాడుతూ రహదారి భద్రత అనేది ఒకరోజు కార్యక్రమం కాదని, ఇది నిరంతరం కొనసాగాల్సిన ఉద్యమమని ప్రజలకు వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా రవాణా నియమాలను పాటించాలని సూచించారు. పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ మాట్లాడుతూ, రహదారి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, వేగ నియంత్రణ వంటి చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. అనంతరం అక్కడున్న ప్రజలతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలు సురక్షితంగా ప్రయాణించి గమ్యస్థానానికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిట్లం గ్రామ ఉపసర్పంచ్ అవేజ్ బేగ్ పంచాయతీ వార్డు మెంబర్లు వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రులు

చేవెళ్ల... ఏప్రిల్ 13(వాయిస్ టుడే)నవాబు పేట్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను తెలంగాణ శాసనసభ స్పీకర్, రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ తో కలిసి స్థానిక శాసనసభ్యుడు కాలే యాదయ్య ఘనంగా ఆవిష్కరించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం,మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహం, డాక్టర్ బాబు జగ్జీవన్ రావు విగ్రహలను ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మహనీయుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.





## కళ్యాణ లక్ష్మి డబ్బులను పెంచాలి

**వీలైంత తొందరగా డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇవ్వాలి ..**

**చెక్కుల పంపిణీ లో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**

ఇందూరు: రాష్ట్ర ప్రభుత్వం తులం బంగారం ఇవ్వకున్నా.. కనీసం కళ్యాణ లక్ష్మి నగదునైనా పెంచాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. జిల్లాకేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సోమవారం కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలాగో నెరవేర్చడం లేదని అన్నారు. కనీసం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ నిధులను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రధానంగా దళారులను ఆశ్రయించకుండా నేరుగా అధికారులను సంప్రదించాలన్నారు. అలాగే నగరంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిస్థితి దారుణంగా ఉందని, ఇప్పటివరకు ఒక్కటి కూడా కేటాయింకాలేదన్నారు. అర్హులైన పేదలు ఎందరో ఉన్నారని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందజేయాలన్నారు. మొత్తం రూ.5.91 కోట్ల విలువ గల 591 కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నగర మేయర్ ఉమారాణి, బిజెపి కార్పొరేటర్లు పాల్గొన్నారు.



## సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందు వరుసలో ఉంటుంది

**వినికిడి సాధన పరికరాల పంపిణీలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా...**

ఇందూరు: సమాజ సేవలో రోటరీ క్లబ్ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని బర్కత్పుర లో గల రోటరీ కేంద్రంలో సోమవారం వినికిడి సాధన పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రోటరీ అంటేనే సేవా కార్యక్రమాలతో పేరుపొందిందన్నారు. వికలాంగులకు జైపూర్ కాళ్ళను అందించడం, వినికిడి సమస్య ఉన్నవాళ్లకు పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. గతంలోనూ అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నానని గుర్తు చేశారు. నగరవాసులు రోటరీ క్లబ్ అందజేసే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినికిడి లోపం ఉన్నవారు, మొహమాటం పడకుండా పరికరాలను వాడాలని సూచించారు. ధన్ పాల్ లక్ష్మీబాయి విట్టల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో రెండు లక్షల విలువ గల వినికిడి పరికరాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం 18 మందికి వినికిడి సాధన పరికరాలను అందజేయడం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు జగదీష్ కులకర్ణి, దాంపల్లి జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్షుడు శ్యాం అగర్వాల్, కార్యదర్శి గోవింద్ జవహర్, కోశాధికారి జుగల్ జాజు, రోటరీ ట్రస్ట్ చైర్మన్ ఆకుల అశోక్ క్లబ్ డైరెక్టర్ రాజ్కుమార్ సుబేదార్, కార్యనిర్వాహణాధికారి డాక్టర్ హరీష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



## అందరి సౌకర్యార్థం నీటి వసతి

**కిషన్ గంజ్‌లో వాటర్ ట్యాంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా...**

ఇందూరు: గ్రామీణులు, కూలీల సౌకర్యార్థం నీటి వసతిని కల్పించడం సంతోషకరమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. ది కిషన్ గంజ్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం గంజ్ లో వాటర్ ట్యాంక్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కిషన్గంజ్ కు జిల్లా వ్యాప్తంగా అనేకమంది నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయడానికి వస్తుంటారన్నారు. వేసవిలో వారి సౌకర్యార్థం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అలాగే వ్యాపార కేంద్రాల్లో అనేక మంది కూలీలు పనిచేస్తుంటారని, వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణంలో తన ట్రస్టు ద్వారా సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. అలాగే తొందర్లోనే కిషన్ గంజిలో సీసీ రోడ్డు వేయించేల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందూరు అభివృద్ధి తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, మర్చంట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కోలా రామ్, అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనంపల్లి చందు, కోశాధికారి వినోద్, హమాలీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించాలి





**- సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీను నాయక్**

**- స్థానికులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ**

నాగార్జునసాగర్ ఏప్రిల్ 13 వాయిస్ టుడే: ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రత నియమావళిని పాటించాలని నాగార్జునసాగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీను నాయక్ అన్నారు,సోమవారము పైలాన్ కాలనీలోని,మత్స్యకార భవనంలోని,హిల్ కాలనీలోని ఒకటవ వార్డులోనూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు,ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ శీను నాయక్ స్థానిక ప్రజలతో రోడ్డు భద్రత నియమా వాళ్ళని పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సాగర్ శీను నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మనిషి ప్రాణం చాలా విలువైనదని రోడ్డు భద్రత నియమావళిని పాటించకుండా ప్రమాదాలకు గురవుతున్నారని అలాకాకుండా భద్రత నియమాలని పాటించి సురక్షితంగా ఉండాలని కోరారు, ద్విచక్ర వాహనదారులు ముఖ్యంగా హెల్మెట్ ధరించాలని సూచించారు,అలాగే కారు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని అన్నారు,అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తాగి వాహనాలు నడిపిన కూడా చర్యలు తప్పవని అన్నారు, గంజాయి డగ్ వంటి మాదకద్రవ్యాలకు యువత బానిస కావద్దని హెచ్చరించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని అన్నారు,ఈ కార్యక్రమంలో నందికొండ మున్సిపల్ చైర్ పర్సన్ ముఖ్య సలహాదారుడు సుమన్, కౌన్సిలర్ సాగర్ బాబు, సలహాదారులు, మైలపల్లి వెంకటేష్,నకిరే కంతి సైదులు, రాజగోపాల్ రెడ్డి,పట్టణ ఓబిసి అధ్యక్షులు జంగన్న,నాగార్జునసాగర్ పట్టణ మత్స్యకారుల సంఘం అధ్యక్షులు కారే రమణ,కార్యదర్శి తాతారావు, మైనార్టీ నాయకులు ముజీబ్, ది కొండ వేణు,రఘు, జయరాం, సత్యనారాయణ రెడ్డి, రాంబాబు, ఏఎస్ఐ గురునాథం, నాగేశ్వరరావు,జావీద్ రాజేష్, సతీష్,మున్సిపల్ సిబ్బంది బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 13 (వాయిస్ టుడే ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని విద్యుత్ డివిజనల్ కార్యాలయం ఎదుట తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు వంట మార్పు చేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుంద నీ వారు తెలిపారు. సమ్మె సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేదంటే పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు పాల్గొని సంఘీభావం తెలిపారు.



## వాలీబాల్ టోర్నమెంట్ విజేత టిఆర్ బి జట్టు

రాయికల్ ( వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు ఆవరణలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాయికల్ శాఖ నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ లో టి ఆర్ బి జట్టు ప్రథమ స్థానంలో , ద్వితీయ స్థానంలో తాట్లవాయి జట్టు నిలిచాయి అని ఫిజికల్ డైరెక్టర్ పుర్రె రమేష్ తెలిపారు. విజేతలకు అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బందెల శ్రీనివాస్, సి.హెచ్ ప్రతాప్,ఆకు రాజేందర్ అనంతులశ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాయికల్ ( వాయిస్ టుడే) : రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలో పంచాయతీ ఆవరణలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ వైద్యులు స్నేహ,గాయత్రి మొత్తం 123 మందికి కంటి పరీక్షలు నిర్వహించి,21 మందిని కరీంనగర్ నగునూరు ప్రతిమ ఆసుపత్రికి రిఫర్ చేశారు.రిఫర్ చేసిన వారికి మంగళవారం ఉచిత బస్సు సౌకర్యం కల్పించి,ప్రతిమ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం భావన, మార్కెటింగ్ సిబ్బంది ప్రకాష్ రావు, శ్యామల,ఉపసర్పంచ్ మూగల సంజీవచారి, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్,గ్రామీణ వైద్యులు జలంధర్, ప్రసాద్, వార్డు మెంబర్లు రాము,కొమురయ్య,శేఖర్,గంగారెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత"అవగాహన సదస్సు



రాయికల్( వాయిస్ టుడే): రాయికల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు, "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా రాయికల్ పురపాలక సంఘం కార్యాలయంలో "అరైవ్ అలైవ్" (Arrive Alive) రోడ్డు భద్రతా వారోత్సవాల సదస్సును సోమవారం నిర్వహించారు. పెరుగుతున్న రహదారి ప్రమాదాలను అరికట్టడానికి వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మరియు అతి వేగాన్ని నియంత్రించుకోవాలని తెలిపారు.రోడ్డు భద్రత మనందరి బాధ్యత' అనే నినాదంతో ప్రజల్లో మార్పు తీసుకురావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని రహదారి నిబంధనలు పాటిద్దాం - సురక్షితంగా గమ్యాన్ని చేరుకుందాం అని ఎస్.ఐ సుధీర్ రావు ఈ సందర్భంగా వివరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కట్కం రవీంధర్, మున్సిపల్ కమీషనర్ కీర్తి నాగరాజు,మున్సిపల్ కౌన్సిలర్ల్ తోపారపు ప్రశాంతి, కూనారపు మానస,వేముల మౌనిక, బత్తిని మహేశ్వరీ నాగరాజు, భూక్య రాకేష్ నాయక్ , పల్లికొండ గంగాధర్,ఆర్.ఐ దేవదాస్, నాయకులు బత్తిని నాగరాజు, పురపాలక సిబ్బంది మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## పరీక్షల ఒత్తిడి ముగిసింది. ..

**ఫలితాల కోసం ఎదురుచూపుల్లో విద్యార్థులు**

ఝరాసంగం ఏప్రిల్13 (వాయిస్ టుడే) : ఝరాసంగం మండలంలోని పదవ తరగతి వార్షిక పరీక్షలు విజయవంతంగా ముగియడంతో విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. చివరి పరీక్ష అనంతరం విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలోనే స్నేహితులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. కొందరు విద్యార్థులు ఒకరికి ఒకరు అభినందనలు తెలియజేసుకుంటూ, పరీక్షల ఒత్తిడి నుంచి బయటపడిన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, పరీక్షలు బాగా జరిగాయని, మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కొంతమంది విద్యార్థులు ఉన్నత విద్య లక్ష్యంగా ఇంటర్‌మీడియట్‌లో మంచి కళాశాలలో చేరాలని సంకల్పం వ్యక్తం చేశారు.ఇకపోతే, తల్లిదండ్రులు కూడా తమ పిల్లల కృషిని అభినందిస్తూ, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఫలితాలపై అధికంగా ఆందోళన చెందకుండా తదుపరి విద్యపై దృష్టి పెట్టాలని సూచించారు.మొత్తంగా, పదవ తరగతి పరీక్షల ముగింపు సందర్భంలో విద్యార్థుల్లో ఉత్సాహం కనిపిస్తుండగా, ఇప్పుడు అందరి దృష్టి రాబోయే ఫలితాలపైనే నిలిచింది.

## శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి వారిని దర్శించుకున్న బీసీ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి జగదీష్

ఝరాసంగం ఏప్రిల్ 13 (వాయిస్ టుడే) : ఝరాసంగం మండల కేంద్రమైన దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి అభిషేకాలు చేసిన బీసీ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి జగదీష్ గారు, అసిస్టెంట్ బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు కె.వి. అమరజ్యోతి, అమర్నాథ్‌లతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఝరాసంగం రజక సంఘం సీనియర్ నాయకులు సిహెచ్. దత్తు పాల్గొన్నారు.



# కవితపై చర్యలకు తడబడుతున్న కేటీఆర్

**ఉద్యమకారుల పార్టీ నుంచి బయటకు పంపించారు..**

**టిఆర్ఎస్‌గా మారుస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు..**

**దళితుడిని ముఖ్యమంత్రి అని చెప్పిన హామీ నిలబెట్టుకోలేదు**

**ఉద్యమకారులకు అండగా రేవంత్ రెడ్డి ప్రజాప్రభుత్వం**

**బంగారు తెలంగాణ పేరుతో అప్పులపాలు,దోపిడీ..**

**బీఆర్ఎస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టిన సిగ్గు రావట్లేదు**

**కేటీఆర్ పై విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు**



హన్మకొండ జిల్లా,వాయిస్ టుడే: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీసుకుంటున్న నిర్ణయాలు,రాజకీయ పరిణామాలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ను అసహజ స్థితిలోకి నెట్టాయని..కవిత పై చర్యలకు కేటీఆర్ తడబడుతున్నారని, ఆయన ఉత్తర కుమారుడిలా ప్రగల్భాలు పలుకుతున్నారని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం హనుమకొండలోని వర్ధన్నపేట నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సహకారంతో బీఆర్ఎస్ పార్టీ ఎదిగిందని..కానీ అదే ఉద్యమకారులను తరువాత పార్టీ నుండి గెంటివేయడం బాధాకరమని అన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీని తిరిగి టీఆర్ఎస్‌గా మారుస్తామని చెబుతున్నారని,అయితే ప్రజలు ఇకపై వారి మాటలను నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. అదే విధంగా దళితుడిని ముఖ్యమంత్రిగా చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని..పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వాగ్దానం కూడా అమలు కాలేదని ఆయన విమర్శించారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. తెలంగాణ ప్రముఖ కవి కాళోజి నారాయణరావు చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ ప్రాంతీయ ప్రజలను మోసం చేసిన వారిని ప్రజలు తిరస్కరిస్తారని,బీఆర్ఎస్ పార్టీని కూడా ప్రజలు ఇప్పటికే రాజకీయంగా పాతిపెట్టారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని “బంగారు తెలంగాణ” పేరుతో అప్పుల కుప్పగా మార్చి దోపిడీ చేశారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు అసత్య ఆరోపణలేనని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 60 వేలకుపైగా ఉద్యోగాలను కల్పించిందని తెలిపారు. ఉద్యోగాల కోసం కోట్ల రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు పూర్తిగా అబద్ధమని ఖండించారు.

అసెంబ్లీ, పార్లమెంట్, ఉపఎన్నికలు,సర్పంచ్ మరియు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి గట్టి సమాధానం ఇచ్చారని పేర్కొంటూ రాబోయే గ్రేటర్ వరంగల్,హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజలు అదే తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల కోసం క్రీడా పోటీలు నిర్వహిస్తే వాటిని కూడా బీఆర్ఎస్ నేతలు బహిష్కరించడం బాధాకరమని విమర్శించారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా రాజకీయ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని,రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేసే విధంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజలు వాస్తవాలను గుర్తించి సరైన నిర్ణయం తీసుకోవాలని,అభివృద్ధి మరియు సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో కుడా చైర్మన్,హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామి రెడ్డి,వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్,కార్పొరేటర్లు జన్ను షీబారాణి అనిల్ కుమార్,ఇతర ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు (దోస్త్ ) నోటిఫికేషన్ విడుదల

హుజూర్ నగర్ ,ఏప్రిల్,13 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యా మండలి 2026 -27 విద్యా సంవత్సరం కు సంబంధించిన డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ ప్రక్రియ కోసం దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని, ఇంటర్ మీడియట్ పూర్తయిన ప్రతి విద్యార్థికి ఈ అప్లికేషన్ చేసుకునే అవకాశం ఉంటుందని హుజూర్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అడ్మిషన్ ప్రక్రియ దశలవారీగా ఈనెల 15వ తారీకు నుంచి ప్రారంభమవుతుందని, ప్రభుత్వ కళాశాలలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రధానమైన భూమికను పోషిస్తాయని అన్నారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఏ ఎజ్రూ ,బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ లో మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, బీఎస్సీ లైఫ్ సైన్సెస్ లో బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించిన గ్రూపులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని, వీటితోపాటు ఈ సంవత్సరం కొత్తగా ప్రవేశపెట్టినటువంటి ఏఈడీపి (AEDP) కోర్సులు కూడా అందుబాటులో ఉంటాయని వాటికోసం విద్యార్థులు కళాశాలను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలన్నారు. దోస్త్ అప్లై చేసుకోవాలనుకునే ప్రతి విద్యార్థి అప్లికేషన్ కి ముందుగా కొత్తగా ఇన్కమ్ సర్టిఫికెట్ ని అప్లై చేసుకుని, మొబైల్ నెంబర్ ను ఆధార్ కు లింకు ఉండేలా చూసుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల దోస్త్ రిజిస్ట్రేషన్ ఆన్లైన్ అప్లికేషను ఉచితంగా చేస్తామని మొదటి ఫేజ్ లో రిజిస్ట్రేషన్ ఫీజు 225 రూపాయలు, రెండు, మూడు పేజ్ లలో రిజిస్ట్రేషన్ ఫీజు 425 రూపాయలు తీసుకొని వచ్చి అప్లికేషన్ చేసుకోవాల్సిందిగా విద్యార్థులకు సూచించారు. మరిన్ని వివరాల 9963941397, 7981771047 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్క పౌరుని బాధ్యత

**ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చు**

**రోడ్డు భద్రత అవగాహన గోడపత్రాల ఆవిష్కరణలో కలెక్టర్**

హనుమకొండ, వాయిస్ టుడే: రోడ్డు భద్రత ప్రతి ఒక్క పౌరుని బాధ్యత అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ‘ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక’ 99 రోజుల కార్యాచరణలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి 18 వరకు నిర్వహిస్తున్న రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే గోడపత్రాలు, కరపత్రాలను హనుమకొండ కలెక్టరేట్ లో కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అతివేగం,నిర్లక్ష్య డ్రైవింగ్,మద్యం సేవించి వాహనం నడపడం వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి ప్రచార కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని,ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.



## ఇంటర్ ఫలితాల్లో గురుకులాల ప్రభంజనం

**సత్తా చాటిన నర్సంపేట మైనారిటీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు.**

**కృషికి తగిన ఫలితం దక్కింది.....**

**గురుకుల కళాశాల ఇంచార్జి కల్పనాదేవి చౌహన్...**

**విద్యార్థులను అభినంధించిన అధికారులు..**

నర్సంపేట (వాయిస్ టుడే.) ఏప్రిల్ 12 : తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఆదివారం ఇంటర్2026 ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో గురుకుల కళాశాలలు ప్రభంజనం సృష్టించాయి. అందులో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేటలోని మైనారిటీ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 17 మంది విద్యార్థులకు గాను 16 మంది విద్యార్థులు ( 94 %) ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ విభాగంలో మొత్తం 22 మంది విద్యార్థులకు గాను 20 మంది (91 శాతం )ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 39 మంది విద్యార్థులకు గాను 36 మంది ఉత్తీర్ణులయ్యారు. అటు మొదటి సంవత్సరం లోను విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎంపీసీ విభాగంలో 22 మంది విద్యార్థులకు గాను 17 మంది విద్యార్థులతో 77% ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ లో 23 మంది విద్యార్థులకు గాను 16 మందితో 70% ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగాయి ఇంటర్ మొదటి సంవత్సరంలో 55 మంది విద్యార్థులకు గాను 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

**ప్రతిభ చాటిన విద్యార్థులు**

ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎం సాత్విక 978 మార్కులతో, సమీనా 963 మార్కులతో బైపీసీ విభాగంలో టాపర్ లుగా నిలిచారని నర్సంపేట గురుకుల జూనియర్ కళాశాల కోఆర్డినేటర్ కల్పనాదేవి చౌహన్ తెలిపారు. ఎండి అఫ్రీన్ ఎంపీసీ 960 మార్కులు ఎండి హుమేరా (బైపీసీ) 957, ఎం హన్సిక (బైపీసీ) 948, ఎస్.కె చినత్ (ఎంపీసీ 943, కే మనీషా (ఎంపీసీ) 941, బి. అంజలి (బైపిసీ) 939, ఎండి సానియా (ఎంపీసీ) 937, పి వర్ష (బైపీసీ) 928, ఆర్. జానకి (బైపీసీ) 924, మార్కులతో టాపర్లుగా నిలిచారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో జి పూజిత ఎంపీసీ లో 470 మార్కులకు గాను 460 మార్కులు సాధించి టాపర్గా నిలవగా కే. మయూరి 455, ఎండి సమీనా 453, ఎస్ కే రషీత 413, మార్కులు మార్కులు సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా మైనారిటీ బోర్డు, జిల్లా నోడల్ అధికారులు, ప్రిన్సిపాల్ శ్రీపాలా, కాలేజీ ఆర్డినేటర్లు కల్పనాదేవి, స్వప్న, అధ్యాపకులు, పలువురు విద్యార్థినీలను అభినందించారు.

## స్వీయ క్రమశిక్షణతోనే రోడ్డు ప్రమాదాల నివారణ : ఎస్పీ రోహిత్ రాజు



పాల్వంచ, ఏప్రిల్ 13, (వాయిస్ టుడే): పాల్వంచ పట్టణంలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పోలీసు శాఖ చేపట్టిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న “అరైవ్ అలైవ్ 2026” కార్యక్రమంలో భాగంగా, పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో ఎం.సీ.బీ.టి ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో సోమవారం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమానికి కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్టీఓ వెంకటరమణ, కార్పొరేటర్ సూకల సరిత, మెడికల్ అధికారి రామ్ ప్రసాద్, జాతీయ రహదారి ప్రాధికార సంస్థ జూనియర్ ఇంజనీర్ మొహమ్మద్ అలీ, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, ఎస్సైలు నాగరాజు, జీవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ



హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత, రక్షణాత్మక డ్రైవింగ్ నియమాలపై విద్యార్థులకు వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ ఉంటే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా లేకపోయినా ప్రతి ఒక్కరూ నియమాలు పాటించే బాధ్యత కలిగి ఉండాలని సూచించారు.

మద్యం సేవించి వాహనం నడపడం, అతి వేగం, మొబైల్ ఫోన్ వినియోగం, తప్పు దారిలో ప్రయాణం, సిగ్నల్ ఉల్లంఘన, అధిక లోడుతో ప్రయాణం వంటి కారణాలతో జరిగే ప్రమాదాలపై వివరించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చివరిగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.



## ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలి

హుజూర్ నగర్, ఏప్రిల్,13 (వాయిస్ టుడే ప్రతినిధి): రోడ్డు భద్రత నియమ నిబంధనలను పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్డిఓ శ్రీనివాసులు, తాసిల్దార్ కవిత,ఎస్సై బండి మోహన్ బాబులు ప్రజలను కోరారు.సోమవారం మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ యరగాని రాధా నాగరాజు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు రోడ్డు భద్రతపై గ్రామసభను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ద్విచక్ర వాహనాలపై,కార్లలో ప్రయాణించేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్టు తప్పనిసరిగా ధరించడం వలన రోడ్డు ప్రమాదాలను అరికట్టడంతో పాటు ప్రాణాలను కాపాడవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమ నిబంధనలపై ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు.యువత మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం నాగయ్య, పంచాయతీ కార్యదర్శి పద్మ, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, పంచాయతీ అధికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.



## రెండో రోజూ సాగర్ డ్యామ్ వద్ద కేంద్ర నిపుణుల బృందం

**అంతర్గత భద్రతపై ఆకస్మిక తనిఖీ**

**ప్రధాన డ్యామ్ గ్యాలరీల్లో క్షేత్రస్థాయి తనిఖీలు**

**లెఫ్ట్ కెనాల్ పరిశీలించిన నిపుణులు**

**డ్యామ్ పటిష్టతపై అధికారులకు కీలక సూచనలు**

నాగార్జున సాగర్, ఏప్రిల్ 13 వాయిస్ టుడే: నాగార్జున సాగర్ ప్రాజెక్టు ను కేంద్ర డ్యామ్ సేఫ్టీ ఎక్స్పర్ట్ కమిటీ చేపట్టిన పర్యటన రెండో రోజు అత్యంత కీలకంగా సాగింది. కమిటీ చైర్మన్ దేవేంద్ర కుమార్ శర్మ నేతృత్వంలోని నిపుణుల బృందం సోమవారం డ్యామ్ వద్దకు చేరుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు,రెండో రోజు పర్యటనలో భాగంగా నిపుణుల బృందం ప్రధాన డ్యామ్‌లోని గ్యాలరీలను సందర్శించి డ్యామ్ లోతైన అంతర్గత భాగాల్లోకి వెళ్లి గోడల పటిష్టత,నీటి ఊట పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు,ఈ పర్యటన ఉదయం నుంచి సుమారు మూడున్నర గంటల పాటు డ్యామ్ పరిసరాల్లోనే గడిపిన బృందం,మధ్యాహ్నం తమ పర్యటనను ముగించుకున్నారు. అనంతరం లెఫ్ట్ కెనాల్ ప్రాంతాన్ని తనిఖీ చేసి,సాంకేతిక అంశాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే కొన్ని కీలక సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి,సూపరిండెంట్ ఇంజనీర్ మల్లికార్జునరావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీతారాం,లతో కమిటీ చైర్మన్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ స్పెషల్ ప్రొడక్షన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు,ప్రాజెక్ట్ డివిజనల్ అధికారులు, అసిస్టెంట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీరునాయక్ తండాలో చెత్త సమస్య తీవ్రం

### కుండీల ఏర్పాటు కోరుతూ వినతి



పాల్వంచ, ఏప్రిల్ 13, (వాయిస్ టుడే): పాల్వంచ మండలం బసవతారక కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని వీరునాయక్ తండాలో చెత్త నిర్వహణ లోపాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యపై స్థానికుడు నునావత్ ప్రసాద్ గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందించారు. గ్రామంలో వెంటనే చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని కోరారు. వీరునాయక్ తండా చివరి వీధి ఎదురుగా రహదారి పక్కన చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల ఆ ప్రాంతం పూర్తిగా డంపింగ్ యార్డుగా మారిందని తెలిపారు. ఈ పరిస్థితుల కారణంగా దోమల పెరుగుదల అధికమై ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని చెత్త పేరుకుపోవడంతో తీవ్రమైన దుర్వాసన వ్యాపించి అస్వచ్ఛ వాతావరణం నెలకొంటోందని వివరించారు. వర్షాకాలంలో మోరీలు మూసుకుపోయి పలుమార్లు నీటి నిల్వ సమస్యలు తలెత్తిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సీతానగర్ కాలనీ, బసవతారక కాలనీ, వీరునాయక్ తండాలో వీధులు సన్నగా ఉండటంతో ట్రాక్టర్ రాకపోవడం ప్రధాన సమస్యగా మారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ప్రతి వీధికి అనువైన ప్రదేశాల్లో చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని, వాటిలో సేకరించిన చెత్తను వారానికి కనీసం నాలుగు సార్లు ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడాన్ని నియంత్రించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రజారోగ్యానికి సంబంధించిన అత్యవసర అంశంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని నునావత్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గ్రామంలో పరిశుభ్ర వాతావరణం కల్పించడం

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**